ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





గంజాయ్.. యువత జోగుతోంది. ఆ మత్తులో నేరాలకు పాల్పడుతోంది. చదువుకునే విద్యార్థులు కూడా బానిసలుగా మారారు. గతంలో ఎక్కడో మారుమూల రహస్యంగా తాగడం, విక్రయించడం జరిగేది. కానీ వైసీపీ హయాంలో గంజాయి తాగడం, విక్రయించడం అనేవి విచ్చలవిడిగా మారాయి. గొడవలు, ఘర్షణలు చివరకు హత్యలు, అత్యాచారాలకు గంజాయే కారణమని పలువురు వాపోయినా నాటి పాలకులకు పట్టలేదు. ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గంజాయి మహమ్మారిని ఓ సవాల్‌గా స్వీకరించింది. పలు ప్రాంతాల్లో ఇప్పటికే పలువురిని అరెస్టు చేసి పదుల కేజీల్లో గంజాయిని స్వాధీనం చేసుకున్నా.. ఆ మహమ్మారి ఇంకా వేళ్లూనుకునే ఉంది. నాటి ప్రభుత్వంలో గంజాయిని విచ్చలవిడి చేయగా నేడు కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం హోం మంత్రి అనిత ఎస్పీలతో దీనిపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఎస్పీలు రంగంలోకి దిగి గంజాయి మత్తును వదిలించాలని ఆదేశాలు జారీ చేశారు.

గంజాయి.. సవాల్

నాడు విచ్చలవిడి.. నేడు కట్టడికి చర్యలు

- వైసీపీ హయాంలో విస్తరించిన మహమ్మారి
- గంజాయిమయంగా ఉమ్మడి గుంటూరు జిల్లా
- విద్యాసంస్థలు సహా అన్ని చోట్ల యథేచ్ఛగా విక్రయాలు
- రోజూ పదుల సంఖ్యలో కేసులు నమోదు.. పలు అరెస్టులు
- హోంమంత్రి అనిత సమీక్షతోనైనా గంజాయి మత్తు వదిలేనా

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో గంజాయి పడగ విప్పి బుసలు కొడుతోంది. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా అంతటా మహమ్మారి విస్తరించింది. వైసీపీ హయాంలో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల విక్రయాలపై కనీసస్థాయి నియంత్రణ కూడా లేకపోవడంతో ఎక్కడంటే అక్కడ గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.200కి విద్యార్థులకు విక్రయిస్తున్నారు. కళాశాల సమీపంలో ఉండే చిన్న చిన్న బడ్డీ కొట్లు, కూడళ్లను కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రేతలు చెలరేగిపోతున్నారు. సాక్షాత్తూ మాజీ ముఖ్యమంత్రి నివాసం ఉంటున్న తాడేపల్లి గంజాయి విక్రయాలకు కేంద్ర బిందువుగా మారినా నాటి పాలకులకు పట్టలేదు. అత్యాచారాలు, హత్యలు చోటుచేసుకున్నా ప్రభుత్వంలో స్పందనలేదు. మంగళగిరి, తాడేపల్లిలో స్కూలు, కళాశాల స్థాయి విద్యార్థులను సైతం గంజాయి విక్రేతలు వదల్లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కిందటేడాది తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన ముగ్గురు ఇంటర్మీడియట్ విద్యార్థులు గంజాయి మత్తులో కృష్ణాయపాలెం వంతెన వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి అక్కడికక్కడే మరణించారు. కాగా గుంటూరులో గంజాయి దొరకని వీధి లేదంటే ఆశ్చర్యం లేకపోవచ్చు. ప్రతి డివిజన్లో ఏదో మూల గంజాయి దొరుకుతోంది. స్వర్ణభారతినగర్ ప్రాంతంలో గంజాయి విక్రయాలపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఎన్నికలకు ముందు ఓ మహిళ ఢిల్లీకి వెళ్లి బొటన వేలు కోసుకున్న విషయం తెలిసిందే. వైసీపీకి చెందిన ఓ ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఈ మహమ్మారి గుంటూరులో అల్లుకుపోయిందని అధికారపార్టీ ఎమ్మెల్యేలు ఆరోపించినా నాటి ప్రభుత్వంలో స్పందనలేదు. పల్నాడు జిల్లాలో సత్తెనపల్లి, అమరావతి, క్రోసూరు, నరసరావుపేట, పిడుగురాళ్లలో మైదాన ప్రాంతాల్లో కూడా గంజాయి విచ్చల విడిగా దొరుకుతోంది. బాపట్ల జిల్లా సూర్యలంకలో పర్యాటక ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో, చీరాల నియోజకవర్గంలోని తీర ప్రాంత గ్రామాల్లో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోంది. ఒకప్పుడు నాటుసారా విక్రయాలు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో ఇప్పుడు గంజాయి యథేచ్ఛగా అందుబాటులో ఉంది. బాపట్ల, చీరాలలోని విద్యా సంస్థలను టార్గెట్ చేసి గంజాయి విక్రేతలు విద్యార్థులను గంజాయికి బానిసలుగా చేస్తున్నారు. వీటిపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం, అధికార యంత్రాంగం గంజాయి నిర్మూలనకు ప్రయత్నిస్తోంది. కానీ గంజాయి అడుగడుగునా సవాలు విసురుతోంది. ఈ పరిస్థితుల్లో మంగళవారం హోంమంత్రి అనిత ఎస్పీలతో జరిగిన సమీక్షలో గంజాయి కట్టడి ప్రధాన అంశమైంది. గంజాయి మత్తును వదిలించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిస్థితుల్లో గంజాయి కట్టడి అవుతుందని ప్రజలంతా ఎదురు చూస్తున్నారు.

కొరవడిన తనిఖీలు

గతంలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టేది. వైసీపీ ప్రభుత్వం ఎస్ఈబీ పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి హడావుడి చేయడం తప్ప మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలేవీ లేవు. గతంలో ఎక్సైజ్, పోలీస్ శాఖలే సమర్థవంతంగా గంజాయి విక్రయాన్ని నియంత్రించాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, వారం వారం తనిఖీలు నిర్వహించి గంజాయి, తదితర మత్తు పదార్థాలను పట్టుకునేవారు. అక్రమార్కులు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల్లో గంజాయిని తరలించడానికి ప్రయత్నించినా ప్రభుత్వ యంత్రాంగం కన్నుగప్పి తరలించడం సాధ్యమయ్యేది కాదు. కానీ వైసీపీ వచ్చాక నేరుగా అధికార పార్టీ నేతలు, కార్య కర్తలే ఈ అక్ర మాల్లో భాగస్వాములయ్యా రు. దీంతో అధికారులు కూడా చూసీ, చూడనట్లు వ్యవహరించడం మొదలు పెట్టారు. ఫలితంగా గడిచిన ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లా గంజాయి హబ్‌లా మారిపోయింది.

కేసులు పెట్టినా.. తగ్గేదేలేదు

రెండు మూడు నెలల్లో పదుల సంఖ్యలో కేసులు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అంత వరకు గంజాయి విషయంలో పట్టీపట్టనట్లుగా ఉన్న పోలీసులు జూలు విదిల్చారు. గంజాయి విక్రయాలను కట్టడి చేసేందుకు దాడులు, అరెస్టులకు రంగంలోకి దిగారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ప్రతి రోజూ పదుల సంఖ్యలో గంజాయి కేసులు నమోదవుతూనే ఉన్నాయి. పోలీసులు కేసులు పెట్టడం, నిందితులను అరెస్టు చేయడం, మళ్లీ గంజాయి విక్రయాలు జరగడం, మళ్లీ అరెస్టులు చేయడం.. సర్వసాధారణంగా మారింది. కేసులు పెడుతున్నా గంజాయి విక్రయాలు మాత్రం తగ్గడం లేదు. కేసుల దారి కేసులదే.. తమ దారి తమదే అన్నట్లుగా గంజాయి విక్రయదారులు చెలరేగి పోతున్నారు.



ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో ముగ్గురు యువకు లను అరెస్టు చేసిన పోలీసులు (ఫైల్)

ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలు నియోజకవర్గ పర్యటనల్లో గంజాయి సమస్యపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా గంజాయి గురించే ప్రజలు ఎమ్మెల్యేల ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్నారు. గంజాయి మత్తులో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని వివరిస్తున్నారు. మొత్తం మీద కూటమి ఎమ్మెల్యేలకు గంజాయి సమస్య షాకుల మీద షాకులు ఇస్తోంది. స్థానిక సమస్యల కంటే అధిక సంఖ్యలో గంజాయి సమస్యపై ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో గంజాయి నియంత్రణ కోసం ఎమ్మెల్యేలు, పోలీసు యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకున్నా గంజాయి విక్రేతలు సవాలు విసురుతున్నారు. గంజాయి సమస్య పరిష్కారం కోసం ఏకంగా జిల్లా ఎస్పీలకు ఎమ్మెల్యేలు కూడా ఫిర్యాదులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద పోలీసులు అరెస్టు చేసిన గంజాయి విక్రయదారులు (ఫైల్)

- సరిగ్గా వారం క్రితం మంగళగిరిలోని ఎయిమ్స్ సమీపంలో పోలీసు అధికారులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు విక్రేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు వారం ముందు తాడేపల్లిలో భారీ స్థాయిలో గంజాయిని, విక్రయించే వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- వారం క్రితం సత్తెనపల్లిలో గంజాయి విక్రయిస్తున్న ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు కిలో గంజాయిని రూ.3 వేలకు విక్రయిస్తున్నాడు. అమరావతి మండలం దిడుగు గ్రామానికి చెందిన ఒకరి వద్ద 10 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్రోసూరు మండలం హసనాబాద్‌లో ఓ మహిళ వద్ద 300 గ్రాముల గంజాయి దొరికింది.

అరెస్టుల పరంపర ఇలా..

- నెల రోజుల క్రితం పల్నాడు జిల్లా మాచర్లలో 32 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. సాగర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయి దొరికింది.
- ఈ నెల 14న పెనుమూడి వంతెన వద్ద గంజాయి విక్రయిస్తున్న 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంతకు ముందు మార్చిలో 457 కేజీల గంజాయిని బాపట్ల శివారులో పోలీసులు పట్టుకున్నారు.



తెనాలి : గంజాయితో పట్టుబడిన నిందితుల వివరాల వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐలు (ఫైల్)

నిధుల పంచాయితీ

- నాలుగు గ్రామాల నిధులు ఒక పంచాయతీకే
- కొణిదెన గ్రామ పంచాయతికీ రూ.1.40 కోట్లు మళ్లింపు
- ఫిబ్రవరిలో వెలుగుచూసిన వ్యవహారంపై సర్పంచ్‌ల గగ్గోలు
- వైసీపీ నేతల హస్తంతో పాటు అప్పటి డీపీవోపైనా ఆరోపణలు
- కూటమి ప్రభుత్వంలో విచారణ.. నేడు కమిషనరేట్‌కు నివేదిక

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ హయాంలో పంచాయతీలను నిర్వీర్యం చేశారు. అంతటితో వదలని పాలకులు నిధులను కూడా ఇష్టంవచ్చినట్లుగా మళ్లించుకున్నారు. నిబంధనల ప్రకారం నాలుగు పంచాయతీలకు దక్కాల్సిన రూ1.40 కోట్లను ఏకపక్షంగా ఒకే పంచాయతీకి మళ్లించుకున్నారు. ఈ బాగోతం బల్లికురవ మండలం కొణిదెన గ్రామంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో వెలుగుచూసింది. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండడంతో ఈ అంశాన్ని తొక్కిపెట్టారు. ఈ క్రమంలో మిగిలిన



కొణిదెన పంచాయతీ కార్యాలయం

పంచాయతీల సర్పంచ్‌ల ఆవేదన పట్టించుకునే వారే కరువయ్యారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఆ అంశంపై ఫిర్యాదులు అందాయి. దీంతో ఏ నిబంధన ప్రకారం నిధులన్నింటిని ఒకే పంచాయతీకి జమ చేశారనే అంశంతో పాటు అప్పుడు జరిగిన అవకతవకలపై రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనరేట్ విచారణకు ఆదేశించింది. ఇప్పటికే విచారణ పూర్తి చేసిన అధికారులు సదరు నివేదికను బుధవారం పంచాయతీరాజ్ కమిషనర్‌కు అందించనున్నారు.

15 ఏళ్ల నుంచి నాలుగు పంచాయతీలకు..

బల్లికురవ మండల పరిధిలో గ్రానైట్ క్వారీల రాయల్టీ భారీ మొత్తంలో వస్తుంది. ఈ మొత్తంలో కొంత భాగం క్వారీలు విస్తరించి ఉన్న నాలుగు పంచాయతీల అభివృద్ధికి కేటాయించాలనే మార్గదర్శకాలు ఉన్నాయి. దీనిలో భాగంగా బల్లికురవ మండల పరిధిలోని నక్కబొక్కలపాడుకు 27 శాతం, మల్లాయపాలేనికి 32 శాతం, కె.రాజుపాలేనికి 17 శాతం, కొణిదెన పంచాయతీకి 24 శాతం ఇస్తున్నారు. దాదాపు 15 ఏళ్లు ఈ నిష్పత్తిలోనే సీనరేజీ నిధులను ఆ గ్రామ పంచాయతీలకు కేటాయిస్తూ వచ్చారు. ఈ మొత్తాన్ని మూడు నెలల కొకసారి ఆయా పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తారు. కానీ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడు క్వార్టర్లకు చెందిన రూ.1.40 కోట్లను ఒక్క కొణిదెన గ్రామ పంచాయతీకే ఈ ఏడాది ఫిబ్రవరిలో జమ చేశారు. ఏళ్ల తరబడి వస్తున్న ఆనవాయితీకి పాతరే యడమే కాకుండా వైసీపీ నేతలు చక్రం తిప్పడం, అప్పటి డీపీవో వాళ్లకు సహకరించడం వల్లే తమకు అన్యాయం జరిగిందని మిగిలిన మూడు గ్రామాల సర్పంచ్‌లు అప్పట్లో రోడ్డెక్కారు. ఇదిలా ఉంటే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చివరి త్రైమాసికంలో జిల్లాలోని అన్ని పంచా యతీలకు జమ చేయాల్సిన రూ.97 లక్షలను సకాలంలో జమచేయలేదు. దీంతో అవి మురిగిపోయినట్లు తెలుస్తోంది.

జూన్ 12న విచారణకు ఆదేశాలు

ఏ నిబంధనల ప్రకారం సీనరేజీ నిధులను ఒకే పంచాయతీకి మళ్లించారో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రస్తుత డీపీవో రవికుమార్‌ను జూన్ 12న ఆదేశించింది. దీనిలో భాగంగా అవకతవకలు జరిగినప్పుడు డీపీవోగా పనిచేసిన రాంబాబు వివరణతో పాటు, తర్వాత ఇన్‌చార్జి డీపీవోగా పనిచేసిన క్రిష్ణ వివరణను కూడా నివేదికకు జతపర్చాలని ఆదేశించింది. దీనికి సంబంధించి బదిలీపై వెళ్లిన రాంబాబును వివరణ కోరగా ఆయన దగ్గర నుంచి తొలుత స్పందన కరువైనట్లు తెలుస్తోంది. వివరణ విషయాన్ని జూన్ 25న మళ్లీ ఒకసారి ఆయనకు రిమైండ్ చేయగా బదులిచ్చారు. అయితే ఆయన ఇచ్చిన వివరణలో పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. డీఆర్‌డీఏ పీడీగా ఉంటూ మూడు వారాలపాటు అప్పట్లో ఇన్‌చార్జి డీపీవోగా ఉన్న కృష్ణ వివరణను కూడా తీసుకున్నారు. అప్పటి కలెక్టర్ రంజిత్ బాషా ఆమోదం లేకుండానే ఆ నిధులపై కొణిదెన పంచాయతీకి ప్రొసీడింగ్స్ ఇచ్చారనేది కృష్ణపై ఉన్న ఆరోపణ. ఇన్‌చార్జి డీపీవో కృష్ణ ఇచ్చిన ఆదేశాలను ఆధారంగా చేసుకునే కొణిదెన పంచాయతీ సర్పంచ్ కోర్టు మెట్లు ఎక్కారు. దాదాపు మూడు వారాల పాటు ప్రస్తుత డీపీవో రవికుమార్ ఈ అంశంపై కసరత్తు చేసి సమగ్ర నివేదికను బుధవారం పంచా యతీరాజ్ కమిషనర్‌కు అందించనున్నారు.

తహసీల్దార్ల నియామకం

17 మందికి పోస్టింగ్‌లిస్తూ కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఎన్నికల్లో భాగంగా బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లి ఇటీవలే యథాస్థానాల్లోకి వచ్చిన తహసీల్దార్లకు జిల్లాలో పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ వెంకటమురళి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. దీనిలో భాగంగా అద్దంకి తహసీల్దార్‌గా జి. శ్రీచరణ, సంతమాగులూరుకు కె.రవిబాబు, అమర్తలూరుకు కె.నెహ్రూబాబు, కొల్లూరుకు బి.వెంకటేశ్వర్లు, చుండూరుకు డి.మల్లికార్జునరావు, వేమూరుకు బి.సుశీలను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. మార్టూరు తహసీల్దార్‌గా టి.ప్రశాంతి, యద్దనపూడికి కె.రవికుమార్, బాపట్లకు పి.కృష్ణకాంత్, పిట్టలవానిపాలేనికి మెహర్‌కుమార్, చీరాలకు కె.గోపీకృష్ణ, వేటపాలేనికి పి.పార్వతి, చినగంజాం మండలానికి జె.ప్రభాకర్‌రావు, కొరిశపాడుకు డి.వెంకటేశ్వరరావు, పర్చూరుకు పి.బ్రహ్మయ్య, కారంచేడుకు కె.నరసింహరావు, కర్లపాలెం మండలానికి ఎస్.వెంకటరత్నంలను తహసీల్దారుగా నియమించారు. బాపట్ల, రేపల్లె, చీరాల ఆర్డీవో కార్యాలయాల ఏవోలుగా ఏ శ్రీనివాసరావు, జాన్ పీటర్, సురేష్‌బాబులను నియమించారు.

పల్నాడులో పోస్టింగ్ నై

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని 28 మండలాలకు తహసీల్దార్లు లేరు. ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన వారు ఇటీవల తిరిగి జిల్లాకు వచ్చారు. అయితే వారికి పోస్టింగ్‌లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఎమ్మెల్యేల సిఫార్సుల లేఖల జారీలో జాప్యంతోనే తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇవ్వడంలేదన్న ఆరోపణలున్నాయి. ఇతర జిల్లాలో విధులు నిర్వహిస్తూ అక్కడ రిలీవై కలెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేసిన 24 మంది తహసీల్దార్లు పోస్టింగ్‌ల కోసం మూడు రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలోని తహసీల్దార్లను ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు బదిలీ చేశారు. ప్రభుత్వఆదేశాల మేరకు ఆయా జిల్లాల నుంచి తహసీ ల్దార్లను రిలీవ్ చేశారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలో విధులు నిర్వహించిన తహసీల్దార్లు ఇక్కడి నుంచి రిలీవయ్యారు. ఎన్నికల ముందు ముగ్గురు తహసీల్దార్లు ఉద్యోగోన్నతితో బదిలీపై వెళ్లారు. ఎన్నికల ముందు నుంచే ఒక మండలంలో తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో జిల్లాలో 28 మండలాలకు తహసీల్దార్లు లేరు.

బీచ్‌ల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు

- అధికారులకు కలెక్టర్ వెంకట మురళి ఆదేశాలు

బాపట్ల, జూలై 30: తీర ప్రాంతాల్లోని బీచ్‌ల్లో ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. బీచ్‌ల వద్ద ప్రమాదాల నివారణపై కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో విస్తరించి ఉన్న 103 కిలోమీటర్ల మేర బీచ్‌ల్లో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్‌ల వద్ద ప్రజలు మునగడానికి హద్దులు నిర్ణయించి హెచ్‌పీడీపీ పైపులను ఏర్పాటు చేయాలన్నారు. కార్తీకమాసంలో అత్యధికంగా పర్యాటకులు వస్తున్నందున పరిశుభ్రతకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పేరలి వద్ద బోట్స్ షికారుకు చర్యలు చేపట్టాలన్నారు. పర్యాటకులు అధికంగా సందర్శించే ప్రాంతాల్లో కొబ్బరి, సరుగుడు తదితర మొక్కలు పెంచాలన్నారు. ఒక్కొక్క బీచ్ వద్ద ఎన్డీఆర్‌ఎఫ్ శిక్షణ పొందిన గజఈతగాళ్లను 25 మందిని ఏర్పాటు చేయాలన్నారు. 15 వేలమంది మత్స్యకారులకు ఇబ్బందులు లేకుండా బీచ్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్నారు.

అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం

ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా పూర్తిగా అరికట్టాలని అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుకపై జరిగిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇసుక అవసరమైన వారంతా ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు వెళ్లి తెచ్చుకోవాలని చెప్పారు. గాజులలంక, జువ్వలకుంట గ్రామాలలో రేవుల వద్ద ఇసుక త్వరలో అందుబాటులోకి రానుందన్నారు. సహజ వనరులను సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశాల్లో జేసీ బి.సుబ్బారావు, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్, మైన్స్ ఏడీ రాజేష్, చెన్నైకు చెందిన తీరపరిశోధన జాతీయ కేంద్రం, షోర్‌లైన్ మేనేజ్‌మెంట్ ప్లానర్ బి.సుధీర్, ఆర్డీవోలు గంధం రవీందర్, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

'క్యాట్'కు వేళాయె!



మేనేజ్‌మెంట్ కోర్సు చదవాలి అనుకునే ప్రతి ఒక్కరూ పేరొందిన కాలేజీల్లో చదవాలనుకుంటారు. అలాంటి మేనేజ్‌మెంట్ కోర్సుల అడ్మిషన్ల తొలి అంచెకు ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో మంచి పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు ఆయా అడ్మిషన్లలో ముందు వరుసలో ఉంటారు.

కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)-2024 నోటిఫికేషన్ వెలువడింది. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. దేశవ్యాప్తంగా 170 నగరాల్లో నవంబరు 24న పరీక్షను నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: అహ్మదాబాద్, ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. గతంలో నిర్వహించిన క్యాట్ పరీక్షల ప్రకారం... మొత్తం 198 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ విభాగాల నుంచి మొత్తం 66 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు 3 మార్కులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తేదీలు:** ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 13 వరకు
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** నవంబరు 5 నుంచి
- **పరీక్ష తేదీ:** నవంబరు 24
- **ఫలితాల ప్రకటన:** జనవరి 2025
- **వెబ్‌సైట్:** https://iimcat.ac.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rdmwKnPలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐఈపీఐడీలో డిప్లొమా

సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి 1200 గంటలు చొప్పున మొత్తం 2400 గంటల బోధన ఉంటుంది. ఇండియన్ సైన్ లాంగ్వేజ్, ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో తరగతులు నిర్వహిస్తారు. ప్రాంతీయ భాషల్లో కూడా వివరణ ఇస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ఈ కోర్సులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు నెలకు రూ.2,000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్/హిందీ భాషలో ప్రావీణ్యం తప్పనిసరి. సాధారణ స్థాయిలో వినికిడి సామర్థ్యం ఉండాలి.

ఉద్యోగావకాశాలు: ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థల్లో సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌గా చేరవచ్చు. మూగ-చెవిటి పిల్లలకు, సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌కు ఇన్‌స్ట్రక్టర్లుగా అవకాశాలు ఉంటాయి.

- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

SCHOLARSHIP ALERT

Mohan T Advani Centennial Scholarship

Description: Blue Star Foundation aims at supporting and empowering underprivileged undergraduate and diploma students enrolled in Architecture and Engineering programmes at select private or government colleges across India through their flagship initiative, i.e. Mohan T Advani Centennial Scholarship Programme.

Eligibility: First and second-year students enrolled in a degree programme in architecture and engineering, such as Electronics Engi neering, Mechanical Engineering, Infor mation Technology (IT), Computer Science (CS), and related STEM fields, excluding Civil Engineer ing. Applicants must have scored a minimum of 80% in Class 10 and Class 12 for first-year students, and at least 80% in Class 12 and 75% in the 1st year for second-year students. Students enrolled in specified colleges* will be eligible to apply. Applicants' annual family income from all sources must be less than INR 6 lakh. Recipients should not be beneficiaries of any other scholarship.

Prizes & Rewards: For engineering and architecture students: INR 75,000 or 50% of the annual fees (whichever is less)

For Diploma Students: INR 30,000 or 75% of the annual fees (whichever is less)

Last Date to Apply: 20-08-2024

Short Url: www.b4s.in/aj/BSFS2

HOPE Engineering Scholarship

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000

Last Date to Apply: 15-08-2024

Short Url: www.b4s.in/aj/SIHE15

buddy4study.com

మమ్మల్ని సంప్రదించకుండానే చర్యలు తీసుకుంటారా?

నిర్మాతల మండలిపై నడిగర్ సంఘం ఆగ్రహం



వివిధ అంశాలపై తమిళ నిర్మాతల మండలి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుందంటూ 'నడిగర్ సంఘం' ఆగ్రహం వ్యక్తం చేసింది. తమను సంప్రదించకుండా చర్యలు ఎలా తీసుకుంటారని నిలదీసింది. తమిళ నిర్మాతల మండలి సోమవారం సమావేశమై పలు తీర్మానాలు ఆమోదించిన విషయం తెలిసిందే. నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషికాలు క్రమబద్ధీకరించాలని, ఆగస్టు 16 తర్వాత కొత్త సినిమాల షూటింగ్ చేపట్టకూడదని, నవంబరు ఒకటి నుంచి సినిమా షూటింగ్‌లు నిలిపివేయాలని.. ఇలా ఆరు తీర్మానాలు ఆమోదించింది. ఇలా ఏకపక్షంగా తమిళ నిర్మాత మండలి నిర్ణయాలను తీసుకోవడాన్ని నడిగర్ సంఘం తీవ్రంగా ఖండించింది. . సినీ రంగంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా షూటింగులు నిలిపివేస్తామని తీర్మానం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. పారితోషికాలు సహా ఇతర సమస్యలపై నడిగర్ సంఘం సహా మిగిలిన సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదని అభిప్రాయపడింది.

> హీరో ధనుష్‌పై తీర్మానం చేయడం సమంజసం కాదని, ఆయనపై నడిగర్ సంఘానికి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని స్పష్టం చేసింది.

అలాగే ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఈ వ్యవహారంపై తదుపరి చేపట్టాల్సిన చర్యలపై తమ సంఘం కార్యనిర్వాహకుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని నడిగర్ సంఘం ప్రకటించింది.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

నవ్య | చిత్రజ్యోతి

పురస్కారాలకు పరిష్కారం దొరికేనా?

అసంతృప్తో, ఆగ్రహమో... 'గద్దర్ పేరుతో సినీ పురస్కారాలు ఇస్తామంటే ముందుకు రారా...' అంటూ ముఖ్యమంత్రి బహిరంగ వేదికపై నుంచి అన్న ఒక్క మాట తెలుగు చలన చిత్ర పరిశ్రమను ఉలిక్కిపడేలా చేసింది. చిత్ర పరిశ్రమలోని సంఘాలు ఆయన ఆహ్వానాన్ని పక్కనపెట్టే ధైర్యం చేశాయా? ఏమీ తెలియనట్లే ఉంటూ తలెగరేసే సాహసం సినీ పెద్దలు చేయగలరా? ముఖ్యమంత్రి మాటల్లోని మర్మం ఏమిటి? అనేదే ఇప్పుడు నడుస్తున్న చర్చ.



సినిమావాళ్ల ప్రభుత్వాలకు చేసుకునే వినతులలో భాగంగానే ఇన్నాళ్లు నంది పురస్కారాల అంశం వార్తల్లో నిలుస్తూ వస్తోంది. అయితే ఇప్పుడు మాత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో వార్తల్లో నిలవడమే ఆసక్తిని కలిగిస్తోంది. నేడో రేపు ఫిల్మ్ అవార్డ్స్ గురించి నోటిఫికేషన్ వస్తుందని అందరూ ఎదురుచూస్తున్న తరుణంలో సీఎం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరో పక్క ఈ అవార్డుల గురించి చర్చించేందుకు మేం ముఖ్యమంత్రిని కలిసేందుకు ప్రయత్నించాం, కానీ వీలు కాలేదు అనే మాట కొంతమంది సినిమా పెద్దల చెబుతున్నారు.

సినిమా పండుగలా పురస్కారాల వేడుక

నంది పురస్కారాలను చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుంది. ప్రతి ఏటా ఉగాది నాడు నంది పురస్కారాల ప్రధానోత్సవం ఆనవాయితీగా వస్తోంది. ఆ వేడుకను ఇండస్ట్రీ మొత్తం పండుగలా జరుపుకునేది. అయితే 2014లో తెలంగాణ ఏర్పడ్డాక అప్పటి ప్రభుత్వం నంది పురస్కారాల స్థానే 'సింహ' పేరుతో కొత్తగా పురస్కారాలను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. నామినేషన్లను సైతం స్వీకరించింది. కానీ దశాబ్ద కాలంలో సినీ ప్రముఖులు ఎన్ని విన్నపాలు చేసినా అది కార్యరూపం మాత్రం దాల్చలేదు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకనో సినీ పురస్కారాలపై ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నంది పురస్కారాలను ఇచ్చే సంప్రదాయాన్ని మళ్లీ కొనసాగించాలంటూ పలు వేదికలపై నుంచి చిత్ర పరిశ్రమ తరఫున సినీ సంఘాలు, కొంతమంది సినీ ప్రముఖులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొంత ఒత్తిడి తెచ్చే ప్రయత్నం కూడా చేశారు. జనవరిలో ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభలో 'గద్దర్ అవార్డ్స్' పేరుతో సినీ పురస్కారాలను ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీని అమలుపై అభిప్రాయాలు, సలహాలు అందించాలని చిత్ర పరిశ్రమ పెద్దలను కోరారు. సినీ ప్రముఖులు సైతం ముఖ్యమంత్రి నిర్ణయాన్ని అభినందించి, మద్దతు తెలిపారు. తర్వాత మాత్రం ఎలాంటి కదలికా లేదు. కానీ మంగళవారం నాడు ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో నంది పురస్కారాల అంశం అనూహ్యంగా తెరపైకి వచ్చింది.

గద్దర్ పేరుతో అవార్డులు ఇష్టం లేదా?

ఏకంగా ముఖ్యమంత్రే బహిరంగంగా అసంతృప్తిని వ్యక్తం చేసే దాకా పరిస్థితి వచ్చిందంటే చిత్ర పరిశ్రమలోని సంఘాలు, సినీ ప్రముఖులు ఏం చేసుంటారు అనే చర్చ జరుగుతోంది. సినిమావాళ్లు బయటపడలేదు గానీ గద్దర్ పేరుతో పురస్కారాలను స్వీకరించడం ఇష్టంలేదనే చర్చ అప్పట్లోనే బహిరంగంగా నడిచింది. ఆ కారణంతోనే సినీ ప్రముఖులు సీఎంను కలసి పురస్కారాల విషయంపై సంప్రదింపులు జరపలేదనే మాట వినిపిస్తోంది. పరిశ్రమ నుంచి ఒక కమిటీగా ఏర్పడి ముఖ్యమంత్రిని కలిసే ప్రయత్నం చేయకపోవడం అలాంటి అభిప్రాయాలకు ఊతమిచ్చింది. 'సినిమా వాళ్లే రాలేదు' అని సీఎం అంటే 'ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ దొరకలేద'నేది సినీ పెద్దలు మాట. జరిగిందేదో జరిగిపోయింది, సినీ ప్రముఖులు, ముఖ్యమంత్రి కలసి పురస్కారాల అంశాన్ని ఓ కొలిక్కితేవాలనేదే ఇప్పుడు పరిశ్రమ ఆకాంక్ష.

స్వయంగా పిలిచినా స్పందించలేదు



నంది పురస్కారాలకు మళ్లే తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఇవ్వాలనుకుంటోంది. నా అంతట నేనే అడిగినా, ఎవరూ ముందుకు రావడం లేదు. ఇది సరికాదు. పురస్కారాల విషయంలో సినీ పరిశ్రమ మౌనంగా ఉంటోంది. గద్దర్ జయంతి సందర్భంగా డిసెంబర్ 9న సినీ పురస్కారాలను ఇవ్వడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉందని గతంలో చెప్పాను. ఈ విషయాన్ని మరోసారి తెలుగు పరిశ్రమకు గుర్తు చేస్తున్నాను. మీ విజ్ఞప్తి కంటే ముందే ఒక అడుగు ముందుకేసి ప్రకటన చేశాను. ప్రతిపాదనతో రావాలని పరిశ్రమ వర్గాలను కోరాను. కారణాలేమిటో తెలియదు కానీ సినీ ప్రముఖులు ఇప్పటివరకూ ప్రభుత్వాన్ని సంప్రదించలేదు. తెలుగు చిత్ర పరిశ్రమ కృషి, విజయాలకు గౌరవంగా గద్దర్ అవార్డులను ప్రకటించాం. సినీ పరిశ్రమ పెద్దల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరం. ఇప్పటికైనా పరిశ్రమ పెద్దలు ముందుకు వస్తే అందరం కలసి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్దాం.

- ఏ. రేవంత్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి

ఆ బాధ్యత ఫిలిం ఛాంబర్ తీసుకోవాలి



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు చొరవ తీసుకొని సినిమా అవార్డులను పునరుద్ధరించే నిర్ణయం తీసుకోవడం సంతోషకరం. ప్రజా కళాకారుడు గద్దర్ గారి పేరు మీదుగా, ప్రతి ఏటా 'గద్దర్ అవార్డ్స్' తెలంగాణ ప్రభుత్వం తరఫున ఇస్తామని వారు ప్రకటించారు. తెలుగు పరిశ్రమ తరఫున, ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలి.

- చిరంజీవి

గద్దర్ అవార్డ్స్‌పై అభ్యంతరం లేదు



మేం ముఖ్యమంత్రిని కలిసేందుకు పలుమార్లు ప్రయత్నించాం. కానీ సీఎంఓ నుంచి మాకు పిలుపు రాలేదు. అందువల్లే ముఖ్యమంత్రిని కలవలేకపోయాం. గద్దర్ పేరుతో అవార్డ్స్ తీసుకోవడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. సీఎం ఎప్పుడు పిలిచినా వెళ్లి కలుస్తాం.

- నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

సీఎంను కలిసిన సినీ నటుడు అర్జున్



సీఎం రేవంత్‌రెడ్డిని సినీ నటుడు అర్జున్ మంగళవారంనాడు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా.. సంత్ శ్రీరామ్‌రావ్ జయంతి సందర్భంగా బుధవారంనాడు నిర్వహిస్తున్న మహా హోమంకు రావాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోరారు. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్లో కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు.

రాణీగా గర్వపడుతున్నాను



విభిన్నమైన పాత్రలతో కథానాయికగా తనదైన పంథాలో కొనసాగుతున్నారు తాప్సీ. 'ఫిర్ ఆయా హసీన్ దిల్‌రుబా' చిత్రంతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. గతంలో వచ్చిన 'హసీన్ దిల్‌రుబా' చిత్రానికి ఇది కొనసాగింపు. అందులో ఆమె రాణి అనే గృహిణి పాత్రలో కనిపించారు. ఇప్పుడు రెండో భాగంలోనూ అదే పాత్రలో కనిపించనున్నారు. 'ప్రతినాయక ఛాయలున్న పాత్ర కావడం వల్ల కొంతమందికి నచ్చలేదు. నాకు బాగా నచ్చింది. ఇలాంటి పాత్రను పోషించినందుకు గర్వపడుతున్నాను' అని తాప్సీ పేర్కొన్నారు. ఆగస్టు 9న ఈ చిత్రం ఓటీటీలో విడుదలవుతోంది.

ప్రొడ్యూసర్ టాక్

ప్రతి శుక్రవారం కొన్ని సినిమాలను విడుదల చేయడం తెలుగు చిత్రపరిశ్రమలో ఒక ఆనవాయితీ. ఆ ఒక్క రోజుతోనే చాలా మంది సినిమావాళ్ల జాతకాలు మారిపోతుంటాయి. అందుకే శుక్రవారం కోసం చిత్ర ప్రముఖులతో పాటు ప్రేక్షకులూ ఆశగా ఎదురుచూస్తుంటారు. ఈ శుక్రవారం కూడా అశ్విన్‌బాబు హీరోగా నటించిన 'శివం భజే' చిత్రం గురువారం, రాజ్ తరుణ్ హీరో పాత్ర పోషించిన 'తిరగబడరా సామీ' సినిమా శుక్రవారం విడుదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా చిత్రాల నిర్మాతలు మల్కాపురం శివకుమార్, మహేశ్వరరెడ్డి మూలి మీడియాతో ముచ్చటించారు.

'తిరగబడరా సామీ'లో కంటెంట్ బాగుంటుంది



భార్యాభర్తలు మూడు ముళ్ల బంధానికి ఎలా కట్టుబడి ఉండాలో సినిమాలో చూపించామనీ, కంటెంట్ బాగుంటుందనీ నిర్మాత మల్కాపురం శివకుమార్ చెప్పారు.

- సైలెంట్‌గా ఉన్న వ్యక్తిని వైలెంట్‌గా మార్చేవి పరిస్థితులే. ఈ కథలో అలాంటి పరిస్థితులే ఉంటాయి. ఒక సాధారణ యువకుడు పరిస్థితుల ప్రాబల్యంతో ఎలా మారాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. రాజ్ తరుణ్ అద్భుతంగా నటించాడు.
- ప్రతి సినిమాతో కొత్త వారిని పరిచయం చేయాలన్నది నా ఉద్దేశం. గత సినిమాల్లో లాగానే ఈ చిత్రంతో మాల్వీ మల్హోత్రా హీరోయిన్‌గా పరిచయమవుతోంది.

> సినిమా అంటే ప్రేమతో చిత్రపరిశ్రమలోకి వచ్చాను. కానీ ఇక్కడ సంపాదించింది ఏమీ లేదు. కాకపోతే మనం బతుకుతూ పదిమందిని బతికించే ఏకైక పరిశ్రమ ఇది. సినిమా సక్సెస్ అయితే దాని మీద ఆధారపడిన ఎన్నో జీవితాలు బాగుంటాయి.

- మన్నారా చోప్రా ఇందులో నెగెటివ్ ఫీమేల్ లీడ్ చేసింది. ఆ పాత్రకు ఆమె యాప్ట్. సినిమా అంతా ఉంటుంది.
- ఈ సినిమా షూటింగ్ దాదాపుగా జహీరాబాద్‌లో చేశాం. అది మా నేటివ్ ప్లేస్. చాలా సరదాగా వర్క్ జరిగింది.
- దర్శకుడు రవికుమార్ చౌదరి చాలా హార్డ్ వర్క్ చేశారు. చెప్పినదానికంటే అద్భుతంగా తీశారు. వెరీగుడ్ డైరెక్టర్.
- జీడీ చక్రవర్తి, నరేశ్ అగస్త్య , సీరత్‌కపూర్‌తో ఓ సినిమా జరుగుతోంది. శ్రవణ్ అనే కొత్త దర్శకుడిని పరిచయం చేస్తున్నా. అలాగే రాహు కేతు అనే వెబ్ సిరీస్ కూడా చేస్తున్నాం.

ట్రైలర్ చూసి వెంకటేశ్ మెచ్చుకున్నారు



హీరో అశ్విన్‌బాబు, తన పుట్టినరోజు ఆగస్టు ఒకటిన కావడం వల్ల అదే రోజు సినిమా విడుదల చేయడం లేదనీ, అన్ని రకాలుగా అనుకూలంగా ఉండడం వల్ల ఆ రోజు విడుదల చేస్తున్నామనీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. ఆయన చెప్పిన వివరాలు ఇవి.

- మున్ముందు పెద్ద సినిమాలు రాబోతున్నాయి. అందుకే ఈ వారం విడుదల చేయడమే కరెక్ట్ అని నిర్మాతగానే కాకుండా డిస్ట్రిబ్యూటర్‌గా కూడా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను.

> కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. ఐదారు జానర్లు కలిపినట్టు ఉంటుంది. అందరినీ ఆకట్టుకొనే అంశాలు చాలా ఉన్నాయి. క్వాలిటీ, కంటెంట్ కోసం అనుకున్న దానికంటే ఎక్కువే ఖర్చు పెట్టాను.

- విక్టరీ వెంకటేశ్ మా ట్రైలర్ చూసి మెచ్చుకున్నారు. ఆయనకి, అశ్విన్‌కు క్రికెట్ పరంగా మంచి రిలేషన్ ఉంది. ట్రైలర్ చూసి బాగుందని ఆయన మెచ్చుకున్నారు.
- ఈ సినిమాకు సంగీత దర్శకుడు వికాసే హీరో. 'హిడింబ' చిత్రం చూసి ఆయన్ని తీసుకున్నాం. మంచి పాటలు, అద్భుతమైన ఆర్ఆర్ ఇచ్చారు.
- 'శివం భజే' హిట్ అయితే తమిళంలో రీమేక్ చేస్తాం. ఐబీటీ కృష్ణమూర్తి టీమ్‌తో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నా. కార్తికేయతో కూడా చిత్రం చేయాలనుకుంటున్నాం.



జాతీయ ర్యాంకులను చూపుతున్న ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు, అధికారులు

నాగార్జున విశ్వవిద్యాలయానికి జాతీయ ర్యాంక్

పెదకాకాని, జులై 30: ఇండియా టుడే-ఎండీఆర్‌ఏ బెస్ట్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ జనరల్ కేటగిరిలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో 12వ ర్యాంకును, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును కైవసం చేసుకుందని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కంచర్ల గంగాధరరావు తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన ర్యాంక్‌ల వివరాలను మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ రెప్యుటేషన్ అండ్ గవర్నెన్స్, అకడమిక్ అండ్ రీసెర్చ్ ఎక్సలెన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లివింగ్ ఎక్స్‌పీరియన్స్, పర్సనాలిటీ అండ్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ కెరీర్ ప్రోగ్రెషన్ అండ్ ప్లేస్‌మెంట్ ఆధారంగా ఇండియా టుడే - ఎండీఆర్‌ఏ ర్యాంకులను కేటాయించినట్లు ఇన్‌చార్జ్ వీసీ పేర్కొన్నారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది కృషి వల్లే ఈ ర్యాంకు సాధ్యమైందన్నారు. ఇటువంటి ర్యాంకుల ద్వారా విశ్వవిద్యాలయ కీర్తి మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్. కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వి.రవి కుమార్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవి కుమార్, సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్. వి.వెంకటేశ్వర్లు ర్యాంకుల విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.రవి తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా డాక్టర్ బ్రహ్మాజీరావు

పెదకాకాని, జులై 30: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డైరెక్టర్ రేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా డాక్టర్ పి.బ్రహ్మాజీరావు (పర్యావరణ శాస్త్రం) నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు నియామక ఉత్తర్వులను బ్రహ్మాజీరావుకు అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఇన్‌చార్జ్ వీసీ గంగాధరరావుకు, రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలంలకు ధన్యవాదాలు తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రవేశాలకు సంబంధించి అన్నిరకాల చర్యలు తీసుకుంటానని, శక్తివంచన లేకుండా కృషిచేసి వర్సిటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

యూజీ పరీక్షల ఇన్చార్జి కో ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ కృష్ణారావు

పెదకాకాని, జూలై 30 ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిగ్రీ (యూజీ) పరీక్షల ఇన్‌చార్జి కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎన్వీ కృష్ణారావు (తెలుగు) నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్వీ కృష్ణారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వీసీ గంగాధర్‌రావుకు, రెక్టార్, రిజిస్ట్రార్లకు ధన్యవాదాలు తెలియజేశారు. బుధవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలామణి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలంలు కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 30: సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం మంగళవారం నాటికి 517.20 అడుగులు ఉంది. ఇది 144.21 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 800 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 5944 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 6744 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,55,716 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

విద్యుదాఘాతంతో టీడీపీ కార్యకర్త మృతి

మేడికొండూరు జూలై 30: మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పాములపాటి సాంబశివరావు(45) విద్యుదాఘాతానికి గురై మంగళవారం మృతి చెందాడు. ఇంట్లో మంచినీటి మోటారు దగ్గర పనిచేస్తుండగా విద్యుత్ షాక్ గురయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సాంబశివరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



మృతుడు సాంబశివరావు

సూపర్ ఛైర్మన్‌కి చేదు అనుభవం

● వైసీపీఎమ్మెల్యే పీఏగా పనిచేసిన ఉద్యోగికి జడ్పీ షాక్.. ● నంద్యాల పంపేందుకు అనుమతి నిరాకరణ

గుంటూరు సిటీ, జూలై 30 : ఆయన జిల్లా పరిషత్(జడ్పీ) ఉద్యోగి. కాలం కలిసొచ్చి గత ప్రభుత్వంలో పల్నాడు వైసీపీ ఎమ్మెల్యే పీఏగా వెళ్లాడు. అంతే. జిల్లా పరిషత్‌ను తన అదుపు ఆజ్ఞల్లోకి తీసుకున్నాడు. ప్రజలు ఎన్నుకున్న ఛైర్మన్‌ను పక్కన పెట్టి, తానే సూపర్ ఛైర్మన్‌గా వ్యవహరించాడు. చివరకు మాతృ సంస్థలోని ఉన్నత అధికారులకు సైతం ఆదేశాలు జారీచేసి మరీ పనులు చేయించాడు. అంతటితో ఆగక జిల్లా పరిషత్‌లో ఉద్యోగం చేస్తున్న ఒక సామాజిక వర్గానికి తీరని ద్రోహం చేసాడు. వెంటాడి మరీ ఆ వర్గానికి చెందిన ఉద్యోగులను జిల్లా మారుమల ప్రాంతాలకు బదిలీ చేయించాడు. చివరకు విడో అన్న కనికరం కూడా లేకుండా మహిళా ఉద్యోగులను సుదూర ప్రాంతానికి బదిలీ చేయించాడు. ఒకానొక సందర్భంలో చివరకు జిల్లా పరిషత్‌లోని అతి ముఖ్యమైన వ్యక్తులను కూడా చెప్పింది చేయండి.. లేకపోతే ఇక్కడ ఉండరు -అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు . జిల్లా పరిషత్‌కు ఏ అధికారి బదిలీ పై రావాలన్నా సదరు ఉద్యోగి దయాదాక్షిణ్యాల మీదే ఆధారపడాల్సిన పరిస్థితిని కల్పించాడు. అటు నియోజకవర్గాల్లో అనేక రకాలైన వ్యవహారాల్లో తలదూర్చి అత్యంత వివాదాస్పదమైన విషయాలను చక్కబెట్టాడు. ఎమ్మెల్యే కంటే ముందే జోక్యం చేసుకొని తెలుగు దేశం పార్టీకి చెందిన అనేకమందిని ఇబ్బందులు పెట్టాడు. చివరకు తానే మినీ ఎమ్మెల్యేగా చలామణి అయ్యాడు. ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. చేతిలో ఉన్న ఎమ్మెల్యే ఓడిపోయి కష్టాల పాలయ్యారు. పీఏగా వాళ్ళని వీళ్లని అదిరించిన పాపానికి రాజకీయ శత్రువులు ఎక్కువయ్యారు. చేసేది లేక.. ఇక్కడ ఉండలేక ఆ ఉద్యోగి నంద్యాల లో ఉన్న ఎమ్మెల్సీ పీఏగా వెళ్లేందుకు ముమ్మర ప్రయత్నాలు చేశాడు. చివరకు అక్కడి కలెక్టర్ కూడా అందుకు ఒప్పుకున్నారు. కానీ ఇక్కడి జిల్లా పరిషత్ అధికారులు మాత్రం సదరు ఉద్యోగిని రిలీవ్ చేసేందుకు నేసేమిరా అంటున్నారు. ఇక్కడే ఉండాల్సిందే.. వేసిన చోట ఉద్యోగం చేయాల్సిందే అంటున్నారు. ఇప్పుడు జడ్పీలో ఇదే హాట్ టాపిక్ అయ్యింది.



రైళ్ల భద్రతకు ఎస్‌పీఎం యాప్

క్రూ పనితీరుపై ఇక నుంచి సమగ్ర విశ్లేషణ ● స్వల్ప వ్యవధిలోనే సవివరంగా సమాచారం

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైళ్ల ఆపరేషన్స్‌లో విధులు నిర్వహించే క్రూ(సిబ్బంది) పనితీరుపై ఇక నుంచి సమగ్ర విశ్లేషణ జరగనుంది. ముఖ్యంగా భద్రత, సమయపాలన అంశాల్లో సంబంధిత ఉద్యోగుల పనితీరుని ఎస్‌పీఎం(స్పీడో-మీటర్)యాప్ ద్వారా కొలమానం చేయనున్నారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ సొంతంగా ఈ యాప్ ని తయారు చేసి అమలులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా రైళ్ల వేగం, బ్రేకింగ్ దూరం, సిగ్నల్ నిబద్ధత వంటివి కూడా పరిశీలించనున్నారు. అలానే పనితీరు మూల్యాంకన ప్రక్రియలో దృశ్య, కంప్యూటర్ నివేదికలు ఈ యాప్ అందించే సమాచారం ఎంతగానో ఉపయోగపడనుంది. స్వల్ప వ్యవధిలో సమగ్ర విశ్లేషణ చేయగలిగే మంచి పరికరంగా ఈ ఎస్‌పీఎం యాప్ మారుతుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇటీవలకాలంలో తరచుగా రైళ్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా ప్రమాదాల్లో సిబ్బంది నిర్లక్ష్యం ప్రస్ఫుటమవుతున్నది. చాలా సందర్భాల్లో అనుమతికి మించి లోకో పైలట్లు వివిధ సెక్షన్లలో రైళ్లను వేగం తో నడుపుతున్నారు. అలానే సిగ్నల్ జంపింగ్ అయిన సంఘటనలు కూడా నమోదు అవుతున్నాయి. ఇంకోవైపు పీ-వే సిబ్బంది, స్టేషన్ మాస్టర్లు మాన్యువల్స్‌ని సక్రమంగా పాటించడం లేదు. ఈ విషయంలో వీరితో పాటు పైలట్లు, లోకోపైలట్లకు తరచుగా కౌన్సెలింగ్ చేయాలని హెడ్‌క్వార్టర్స్ నుంచి ఆదేశాలు జారీ అవుతున్నాయి. అయినప్పటికీ ప్రమాదాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఇటీవల ఒక స్పెషల్ ట్రైన్ విషయంలో గుంటూరు డివిజన్ పరిధిలో సాంకేతిక సమస్య ఉత్పన్నమై ఆ రోజున ఒక్కో రైలు నాలుగు గంటల ఆలస్యంగా నడపాల్సిన పరిస్థితి తలెత్తింది. అలానే గత ఏడాది ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో రెండు బోగీల్లో అగ్నిప్రమాదం చోటు చేసుకొన్నది. మరో సంఘటనలో విష్ణుపురం వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ప్రాణనష్టం జరగకపోయినా రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ భద్రత, సమయపాలన విషయంలో కట్టుదిట్టంగా ఉండాలని నిర్ణయించింది. అందులో భాగంగానే ఈ ఎస్‌పీఎం యాప్‌ని తాజాగా తీసుకొచ్చింది. ఈ యాప్ భద్రతతో పాటు లోకోకు సంబంధించిన వేగం, మొబిలిటీ వంటి అంశాల్లోనూ ఎంతగానో ఉపయోగపడుతుందని ఉన్నతాధికారులు తెలిపారు. రెండు రోజుల క్రితం ఈ యాప్ గురించి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఆర్ఎం ఎం రామకృష్ణకు వివరించారు. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా ఎస్‌పీఎం యాప్‌ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు.



అమ్మనాన్నలను మరిపించేలా మాచర్లను అభివృద్ధి చేస్తా

● చట్టపరంగా దోషులకు శిక్ష తప్పదు... ● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల,జూలై 30 : ఎమ్మెల్యేలుగా వ్యవహరించిన నా తల్లిదండ్రులైన నాగిరెడ్డి,దుర్గాంబలను మరిపించేలా మాచర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. మంగళవారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళ నుంచి అభివృద్ధి మసకబారి అరాచకం,దౌర్జన్యం,భూములు లాక్కోవడం,అక్రమ కేసులు బనాయించి స్టేషన్లలో హింసించడం లాంటి ఘటనలకు పాల్పడిన వ్యక్తులు చట్టపరంగా శిక్షను అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎల్లకాలం అధికారంలో వుండి ప్రతిపక్ష నేతలను హింసిద్దామని భ్రమించారని అందుకోసమే విజ్ఞులైన ఓటర్లు గట్టి గుణపాఠం చెప్పి 11 సీట్లకు పరిమితం చేసి ప్రతిపక్ష హోదాలేకుండా చేశారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా సదరు నేతల ప్రవర్తనలో మార్పు రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు.సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి తీరతామని,ఇంటింటికి కుళాయి కనెక్షన్,నిరుపేదలకు నివేశనా స్థలాలతో పాటు గృహాలు నిర్మించి ఇస్తామని పేర్కొన్నారు.డిసెంబర్ మొదటి వారం కల్లా జాతీయ రహదారి పనులు పూర్తవుతాయని చెప్పారు.బుగ్గవాగు రిజర్వాయర్ ఆధునీకరణ, సత్రశాల ఆలయం అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి పెడతానన్నారు. పార్టీలో గ్రూపుల గోలొద్దని మనందరం ఒకటే అనే భావంతో వ్యవహరిద్దామని చురకలు వేశారు.ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ మండల అధ్యక్ష,ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి,శ్రీనివాసరావు,టౌన్ అధ్యక్షులు రాజారెడ్డి మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డి,రాయపరెడ్డి,రామకృష్ణ,దానయ్య, కృష్ణారెడ్డి,నాళం పెదబాబు,మర్రి రాజ్‌కుమార్,సామ్యేల్, ప్రభురాజ్,మౌలాలి,అప్పయ్య,సిద్ధయ్య,మల్లయ్య పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

సొంతింటి కల నెరవేర్చాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 30 : ఇల్లులేని ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చాలన్నదే కూటమి ప్రభుత్వం ధ్యేయం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ. జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చేనాటికి అన్ని శాఖలలో అప్పులు తప్ప ఆదాయ మార్గం కనిపించలేదన్నారు. అధికారం చేపట్టిన వెంటనే ఐదు కీలకమైన హామీలపై సంతకంచేసి ఒకొక్కటిగా నెరవేర్చుకుంటూ రైతులకు, యువతకు, 60లక్షల మంది అవ్వా తాతలకు, ఉద్యోగులకు లబ్ధి చేకూరే విధంగా అడుగులు ముందుకు వేస్తున్నారన్నారు. ఇలా ఒకొక్కటిగా హామీలు నెరవేర్చుకుంటూ పోతున్న ఎన్డీఏ ప్రభుత్వం మరొక కీలకమైన అందరికీ ఇల్లు అనే నిర్ణయం తీసుకుందన్నారు. ఇళ్ల నిర్మాణంలో పేదలు ఇబ్బంది పడకూడదనే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. పీఎంఏవై కింద వంద రోజులలో పెండింగ్‌లో ఉన్న లక్ష 25 వేల ఇళ్లను, సంవత్సర కాలంలో 8,25,000 ఇళ్ళను పూర్తిచేసి పేదలకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతుందని వెల్లడించారు.

వ్యాపార అభివృద్ధికి యూనియన్ బ్యాంక్ అండ

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు సిటీ, జూలై 30: చిన్న, మధ్యతరగతి పారిశ్రామిక వేత్తల వ్యాపార అభివృద్ధికి యూనియన్ బ్యాంకు వెన్ను దన్నుగా నిలుస్తుందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గుంటూరులోని యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం జరిగిన మైక్రో స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్మెంట్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. బ్యాంక్ రీజనల్ హెడ్ ఎస్ఎస్ జవహర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ ఎంపవర్ స్కీం కింద రూ.కోటి నుంచి రూ.50 కోట్ల వరకు రుణం ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు తక్షణ ఋణిణ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ముఖ్య కార్యాలయ ఏజీఎం జితేందర్, డిప్యూటీ రీజినల్ హెడ్ అశ్వర్థనాయక్, రాజేష్, ఎంఎల్‌పీ ఏజీఎం హరేరామ్‌షా తదితరులు పాల్గొన్నారు.



ఖాతాదారులకు పత్రాలను అందజేస్తున్న ఆలపాటి, బ్యాంక్ రీజినల్ హెడ్ జవహర్, ఏజీ జితేందర్

సిటీ శాఖలో పునర్విభజన అస్తవ్యస్తం

రీజనల్ కార్యాలయాలతో సర్కిల్స్ నిర్వీర్యం

గుంటూరు, జూలై 30: గత వైసీపీ ప్రభుత్వ పెద్దల అనాలోచిత విధానాల కారణంగా వాణిజ్యపన్నులశాఖలో సర్కిల్స్ కార్యాలయాల పనితీరు నిర్వీర్యమైంది. శాఖలో కీలకంగా ఉన్న సర్కిల్ కార్యాలయాల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సర్కిల్స్ పునర్విభజన ప్రక్రియ అభాసుపాలైంది. రాష్ట్ర వ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సర్కిల్స్ పునర్విభజన ప్రక్రియను పునఃపరిశీలించి లోపాలను సరిదిద్దాలని ది సిటీ ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు కోరుతున్నారు. చిలకలూరిపేట, మాచర్ల, అద్దంకి, వినుకొండ లాంటి పట్టణాల్లో సర్కిల్ కార్యాలయాలు ఎత్తి వేశారు. తద్వారా అక్రమ వ్యాపారాలపై నిఘా కొరవడిందని ఆ శాఖ సిబ్బందే చెబుతున్నారు. కొందరి వైసీపీ నేతల అక్రమ వ్యాపారాలకు అడ్డులేకుండా ఉండేందుకు కొందరు పెద్దలు సర్కిల్ కార్యాలయాలను సైతం ఎత్తివేశారన్న ఆరోపణలున్నాయి. ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పయ్యావుల కేశవ్‌ను ఇటీవల ది సిటీ అసోసియేషన్ గుంటూరు-2 డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ జానీబాషా కార్యవర్గం నాయకులు కలిసి సర్కిల్స్ పునర్విభజన లోపాలను సరిదిద్దాలని కోరారు. అలానే నిబంధనలకు విరుద్ధంగా రీజనల్ కార్యాలయాల పేరుతో ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

బదిలీలు.. పోస్టుల రద్దు

గతంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతి, విజయవాడ, వైజాగ్‌లలో ఏర్పాటు చేసిన రీజనల్ కార్యాలయాల్లో విధులకు డివిజనల్, సర్కిల్స్ కార్యాలయాల నుంచి ఉద్యోగులను బదిలీ చేశారు. బదిలీల్లో కూడా నిబంధనలు పాటించలేదని ఉద్యోగ సంఘాల నాయకులు ఆక్షేపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1157 పోస్టులు రద్దు చేశారు. తద్వారా సర్కిల్స్, డివిజనల్ కార్యాలయాల్లో సిబ్బంది కొరతతో పనులు కుంటుపడిపోయాయి. మరో వైపు గజిటెడ్ హోదా కలిగిన గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ అధికారులకు సరైన బాధ్యతలు కేటాయించక పోవడంతో ఆ క్యాడర్ నుంచి తగిన ఫలితాలు రాబట్టడంలో వెనుకబడుతున్నారన్న విమర్శలున్నాయి. వారికి కనీసం జాబ్ చార్ట్ కూడా ఇవ్వలేదన్న విమర్శలు ఉన్నాయి.

మిర్చి కొనుగోళ్లు పెంచేందుకు చర్యలు

జీఏంసీ సెక్రెటరీ వెంకటేశ్వరరెడ్డి ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కొనుగోళ్లు పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో శీతల గిడ్డంగుల్లో రంగు మారుతున్న మిర్చి అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మార్కెట్‌యార్డుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాల నుంచి రైతులు మిర్చిని తీసుకొచ్చి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. కొంతమంది రైతులు మిర్చి ధర రాబోయే రోజుల్లో పెరుగుతుందన్న తలంపుతో శీతలగిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది మిర్చి రేటు రకం, నాణ్యతని బట్టి క్వింటాల్‌కి సుమారు రూ. 3 వేల నుంచి రూ. 7 వేల వరకు తగ్గిందన్నారు. రైతులు మిర్చి అధిక దిగుబడి కోసం రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగించి ఉన్నారు. దీని వలన శీతల గిడ్డంగిలో ఏడాది కి పైగా నిల్వ చేసిన మిర్చి రంగు మారడంతో పాటు ఫంగస్ చేరుతున్నదన్నారు. ప్రస్తుతం యార్డులో రోజుకు 45 వేల టిక్కీల విక్రయం జరుగుతున్నది. దీని దృష్ట్యా రైతులు మార్కెట్‌లో ధరల హెచ్చు తగ్గులను గమనిస్తూ గిట్టుబాటు ధరకు మిర్చిని విక్రయించుకొనేదుకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00



వైద్య పరికరాలు అందజేస్తున్న ఎన్నారై డాక్టర్ రవికుమార్

జింకానా వైద్యుల సేవలు అభినందనీయం

గుంటూరు (మెడికల్) జూలై 30: ప్రభుత్వ సమగ్రాస్పత్రి అభివృద్ధికి జింకానా చేస్తున్న సేవలు అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం శుశృతహాల్‌లో జరిగిన కార్యక్రమంలో గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఉత్తర అమెరికా (జింకానా) మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్ త్రిపురనేని రూ.15 లక్షల విలువైన ఎనస్థీషియా వైద్య పరికరాలను ప్రభుత్వాస్పత్రికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జింకానా దాతృత్వంతో ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆవరణలో రూ.100 కోట్ల భారీ వ్యయంతో ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణ పనులు సాగుతున్నట్లు తెలిపారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో పేదలకు కూడా కార్పొరేట్ వైద్యసేవలు అందాలనే ఉద్దేశంతో నిరంతరం తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణ, మత్తు మందు వైద్య విభాగాధిపతి డాక్టర్ పోలయ్య, జింకానా కోఆర్డినేటర్ డాక్టర్ పీవీ హనుమంతరావు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

గుంటూరు (మెడికల్) జూలై 30: గుంటూరు వైద్య కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో పలు పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జీఎంసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీటీకే రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లమో ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఎనస్థీషియా టెక్నీషియన్, మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్, రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, పర్ఫ్యూషన్ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్, రేడియోగ్రాఫిక్ అసిస్టెంట్, డార్క్ రూమ్ అసిస్టెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు ఆయన వివరించారు. రెండేళ్ల కాల పరిమితి గల ఈ డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు సమర్పించేందుకు ఆగస్టు ఆరు ఆఖరు తేదీ అని, ఆగస్టు 19న కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రొఫెసర్ టీటీకే రెడ్డి వెల్లడించారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్‌లు

క్రోసూరు, జూలై 30 : పల్నాడు జిల్లా క్రోసూరు మండల పరిధిలోని విప్పర్ల గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిప్లమో కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లను బుధవారం స్పాట్ అడ్మిషన్ విధానంలో భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ రమాదేవి మంగళవారం తెలియజేశారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ స్పాట్ అడ్మిషన్‌లకు అర్హులన్నారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో బుధవారం వ్యక్తి గతంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్దకు హాజరు కావాలని తెలిపారు. ప్రవేశం పొందిన అభ్యర్థులు పూర్తి ఫీజు రూ 4700, కౌన్సిలింగ్ ఫీజు రూ 1100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కౌన్సిలింగ్ ఫీజు రూ 350 చెల్లిస్తే పోతుందన్నారు. స్పాట్ అడ్మిషన్‌ల ద్వారా ప్రవేశం పొందిన అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు. పూర్తి వివరాల కోసం 9440613229 నెంబరులో సంప్రదించాలన్నారు.

నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ

క్రోసూరు, జూలై 30: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ప్రభుత్వం ద్వారా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కోటప్పకొండలోని ట్రైనింగ్ సెంటర్ జాబ్స్ కో-ఆర్డినేటర్ మంగళవారం తెలియజేశారు. శిక్షణా కాలం నాలుగు నెలలు ఉంటుందని, కామన్ సబ్జక్టులుగా కంప్యూటర్ కోర్సు, కంప్యూటర్ టైపింగ్, స్పోకెన్ ఇంగ్లీషు, జాబ్స్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ నేర్పుతామన్నారు. విద్యార్హత ఏదైనా డిగ్రీ పాసై 18 నుంచి 30 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్రైవేట్ మల్టీ జ్యువెలర్స్ షోరూంలలో, కస్టమర్ సేల్స్ అసోసియేట్ , సేల్స్ సూపర్ వైజర్, కంప్యూటర్ ఆపరేటర్, టీమ్ లీడర్, బిల్లు ఆపరేటర్, టాలీ ఎకౌంటెంట్ ఆపరేటర్ మొదలైన ఖాళీల్లో అవకాశాలు కల్పింస్తామన్నారు. జీతం రూ 15వేలు నుంచి రూ 25వేలు వరకు ఉంటుందని, నిబంధనల ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉంటుందని, ఉద్యోగంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అభ్యర్థులకు మాత్రమే ఇక్కడ శిక్షణకు అవకాశం ఉందన్నారు. నరసరావుపేట మండలం కోటప్పకొండ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9010585360 నెంబరులో సంప్రదించాలన్నారు.

బాంబు కేసులో నిందితులు అరెస్టు

దుర్గి, జూలై 30: పల్నాడు జిల్లా దురిగ మండలం జంగమహేశ్వరపాడులో మే 24వ తేదీన టీడీపీ సానుభూతిపరుడు గుమ్మా నాగరాజు ఇంట్లో నాటుబాంబులు, మరణాయుధాలు ఉండడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఈనెల 17వ తేదీన మండలంలోని కాకిరాలకు చెందిన బొజ్జా నాగేంద్రబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే కేసులో తాజాగా మంగళవారం కాకిరాలకు చెందిన బాణావత్ శ్రీనునాయక్ అలియాస్ లడ్డు శ్రీనును కూడా అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మే 7వ తేదీన జంగమహేశ్వరపాడు శివారులో నాటుబాంబులు, మారణాయుధాలను దాచి అక్కడినుంచి గుమ్మా నాగరాజు గృహానికి చేర్చారన్నారు. సమాచారం తెలుసుకున్న అప్పటి సీఐ చినమల్లయ్య నాటు బాంబులు, మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈనెల 7వ తేదీన పొలంలో నాటుబాంబు పేలడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారన్నారు. గతంలో గుమ్మా నాగరాజు గృహంలోకి నాటుబాంబులు తరలిస్తున్న సమయంలో ఒక నాటుబాంబు మిగిలిపోయిందని, ఆ బాంబు ఈనెల 7వ తేదీన పొలంలో పేలిందని సీఐ శ్రీనివాసరావు వివరించారు.

టీఎన్‌టీయూసీకి అనుబంధంగా ఏపీసీబీఈఏ

మంగళగిరి, జూలై 30: ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జూన్ 6న గుంటూరులో జరిగిన సమావేశంలో టీఎన్‌టీయూసీకి అనుబంధంగా ఏర్పడినట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనేరు బాలాజీ ప్రసాద్ తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళగిరి బ్రాంచి కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకుల ఉద్యోగులు ఇకపై టీఎన్‌టీయూసీకి అనుబంధంగా పనిచేస్తున్న ఏపీసీబీఈఏకు మద్దతుగా ఉంటారన్నారు. రాష్ట్ర కార్యదర్శులు డి.శ్రీనివాస్, జీ.శ్రీనివాస్ మాట్లాడుతూ నెల్లూరు డీసీసీబీలో ఇటీవల వైఎస్ఆర్‌టీయూసీకి అనుబంధంగా ఉన్న కొంతమంది యూనియన్ బైలాకు వ్యతిరేకంగా సెంట్రల్ కమిటీ సమావేశం నిర్వహించి ఒకరిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కోఆప్ట్ చేస్తున్నట్లు ప్రకటించారని, ఇది ట్రేడ్ యూనియన్ బైలాకు పూర్తి విరుద్ధమన్నారు. రాష్ట్ర జనరల్ బాడీలో ఎన్నికైన ప్రధాన కార్యదర్శి రాజీనామా చేయకుండా వేరొకరిని కోఆప్ట్ చేయడం చెల్లదన్నారు. వైఎస్ఆర్ టీయూసీకి చెందిన కొంత మంది నాయకులు కార్మిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సహకార శాఖా మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లనున్నామని చెప్పారు. వైఎస్ఆర్‌టీయూసీ యూనియన్ నేతల ను ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కానీ, వేతన సవరణ చర్చలకు కానీ ఆహ్వానించవద్దని ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డికి విన్నవించినట్లు తెలిపారు. వైఎస్ ఆర్‌టీయూసీకి అనుబంధంగా ఉన్న కొంత మంది నేతలను అసోసియేషన్ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు.

45,472 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 47,204 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 45,472 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 17,480 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	15500	334	10000	15000
నెంబరు. 5	10000	14000	నెంబరు. 5	12000	12000
273	9500	12500	273	11300	14000
341	8500	16500	341	9500	14500
4884	10000	10000	4884	11500	16000
సూపర్ 10	15000	15000	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18500	తేజ	10300	18400
బ్యాడిగి	9000	14500	బ్యాడిగి	9000	12800
దేవనూరుడీలక్స్	8500	12500	దేవనూరుడీలక్స్	9000	15000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

పరిశ్రమల స్థాపనకు అధిక ప్రోత్సాహం ఇవ్వాలి : కలెక్టర్

బాపట్ల, జూలై 30 : జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అధిక ప్రోత్సాహం ఇవ్వాలని కలెక్టర్ జె.వెంకటమురళీ తెలిపారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) అమలు తీరుపై అధికారులతో మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉత్పత్తి రంగాల ప్రోత్సాహానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నాయని చెప్పారు. పరిశ్రమల స్థాపించగోరే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ పథకం కింద ఒక్కొక్క యూనిట్‌కు 10 లక్షల రూపాయలకుపైగానే ఉంటుందన్నారు. 15 నుంచి 35 శాతం రాయితీ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. జిల్లాలో 138 పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించగా 61 దరఖాస్తులు అందాయన్నారు. ఇప్పటికే 25 యూనిట్‌లు మంజూరయ్యాయని పొదుపు సంఘాల మహిళలకు అవకాశం కల్పించాలని, అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నెలరోజులలో దరఖాస్తుల సేకరణ ఎంపిక ప్రక్రియ చేపట్టాలన్నారు. వేగంగా రుణాలు మహిళలకు అందేవిధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

● మినీగోకులాల పథకం లక్ష్యాలు చేరుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళీ తెలిపారు. జిల్లాలో 775యూనిట్‌లు స్థాపించేందుకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. 90శాతం రాయితీపై రుణాలు అందజేస్తామన్నారు. ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు పొంది ఉన్న వారికే మినీ గోకులాలు అమలౌతాయన్నారు. గేదెల కొరకు షెడ్ నిర్మాణం, గొర్రెలు, మేకల కొరకు షెడ్‌లు, కోళ్ళ పౌల్ట్రీలు నిర్మాణానికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. తక్షణమే అర్హులను గుర్తించి పథకం వర్తింపచేయాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి వై.రామకృష్ణ, ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలి డిడి రమేష్‌బాబు, ఎల్‌డిఎమ్ శివకృష్ణ, డ్వామా పీడీ రాజేష్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులలో నైపుణ్యాలు పెంపొందించాలి

పరిశ్రమలలో అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులలో నైపుణ్యాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ జె.వెంకటమురళీ తెలిపారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రణాళికపై మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయాధారిత పరిశ్రమలలో ఉన్న అవకాశాలను గుర్తించి గ్రామీణ యువతకు అవగాహన కల్పించాలన్నారు. బాపట్లజిల్లాలో ఆక్వారంగం అధికంగా అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా ఆ రంగంలో అవకాశాలు ఉంటాయన్నారు. వాటికి సంబంధించిన కోర్సులలో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పనపై దృష్టిసారించాలన్నారు. జిల్లా వనరులను గుర్తించి వాటికి అనుగుణంగా ఉపాధి కల్పించే రంగాలలో యువతకు నైపుణ్యం కల్పించాలన్నారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు జిల్లాలో ప్రణాళిక ఉద్దేశాలను వివరించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ వైపి రెడ్డి, మెప్మా పీడీ వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమలశాఖాధికారి రామకృష్ణ, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రఘు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కట్టడికి ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం : ఎస్పీ



ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, జూలై 30 : జిల్లాలో గంజాయి కట్టడి చేయటానికి ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేశామని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. గంజాయి కట్టడిపై మంగళవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పాల్గొన్న ఎస్పీ జిల్లాలోని శాంతిభద్రతుల సమస్యలు గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో నేరాలకు పాల్పడినవారిపై నిఘా ఉంచామన్నారు. గంజాయి సేవించేవారు నిర్మానుష్య ప్రదేశాలను ఆవాసాలుగా చేసుకునే అవకాశం ఉంటుంది కనుక అటువంటి ప్రదేశాలలో పోలీసుసిబ్బందితో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆకతాయిల ఆగడాలు నుంచి మహిళలకు, విద్యార్థులకు రక్షణ కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహిస్తారన్నారు. సైబర్ నేరాలను వేగవంతంగా ఛేదించేందుకు సాంకేతిక పరిజ్ఞానంలో నిష్ణాతులైన పోలీసు అధికారులు, సిబ్బందితో త్వరలోనే పటిష్టమైన సైబర్ విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి : జేసీ

బాపట్ల, జూలై 30 : ప్రజాపంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం చేయటానికి వ్యవస్థలన్నీ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ఆదేశాల మేరకు ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు వివిధ సంస్థలు, రైతులు, వినియోగదారులు నుంచి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఈబి విలియమ్స్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు ప్రభుత్వం వివిధ సంస్థలు, వ్యక్తులు నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కేరళ రాష్ట్రంలో ఉన్నవిధంగా ప్రజాపంపిణీ వ్యవస్థలో తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులను మార్జిన్ ఫ్రీఅవుట్‌ల ద్వారా అందజేయాలని కోరారు. ప్రభుత్వం గతంలో వలే నిత్యావసర వస్తువులతోపాటు చింతపండు, కారం, పసుపు, ఉప్పు, మినుములు తదితర వస్తువులు అందజేయాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో రవీందర్, జిల్లా తూనికల, కొలతల శాఖల అధికారి పి.లీల్లి, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ దేవరాజు, సోషల్ వెల్ఫేర్ డీడీ జె.రాజాదెబోరా, జిల్లా సహాయ పౌరసరఫరాల అధికారి కె.సత్యమంగలాంబ, డీసీఐసీ కన్వీనర్, డిప్యూటీ తహసీల్దార్‌లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, బాపట్ల వినియోగదారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పీసీ సాయిబాబు, రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, రైతులు, వివిధశాఖల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సుబ్బారావు

మైనార్టీ అభ్యర్థులకు టెట్ ఉచిత శిక్షణ

బాపట్ల, జూలై 30 : ముస్లిం మైనార్టీ అభ్యర్థులకు టెట్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు అంజుమన్ కమిటీ లీగల్ అడ్వయిజర్ జమ్మద్‌బాషా తెలిపారు. శ్రీభావపురి విద్యాసంస్థలలో ఆగస్టు 1వ తేదీ నుంచి సెప్టెంబరు 25వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాన్ని మంగళవారం బాషా ప్రారంభించి అభ్యర్థులకు మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ శర్మ, దేవేంద్ర, నరేంద్ర పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకాలనీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం : కమిషనర్

బాపట్ల,జూలై 30 : పట్టణంలోని 3వ వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ అధికారులు, నాయకులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు ఈ ప్రాంతాన్ని సందర్శించి యానాదుల సమస్యలపై తీవ్రంగా స్పందించి అధికారంలోకి రాగానే ఎస్టీ కాలనీల అభివృద్ధి ఇక్కడ నుంచే ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈనేపథ్యంలో కమిషనర్ నిర్మల్‌కుమార్ వార్డులోని ప్రతివీధిలో పర్యటించి ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతర్గతంగా డ్రైనేజీలు ఉన్నప్పటికి నిర్వహణ లేని కారణంగా పూడుకుపోయి వర్షాల సమయంలో రోడ్లపై నీరు నిలిచి ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. ఖాళీప్లాట్‌లలో పెరిగిపోయిన ముళ్ళచెట్లు వల్ల విషపురుగుల సంచారం ఎక్కువగా ఉందని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. యానాదుల నివాసం ఉంటున్న ప్రాంతానికి రహదారి, విద్యుత్ లైన్ లేకపోవటాన్ని తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తామని హామినిచ్చారు. కాలనీలోని చివరి రోడ్డుకు అడ్డంగా జంతువధశాల ప్రహరి ఉండటం వల్ల మెయిన్‌రోడ్డుకు వెళ్ళటం ఇబ్బందిగా ఉందని దీనిపై గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు చేస్తే నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరించలేదని స్థానికులు వివరించారు. వెంటనే రోడ్డును జమ్ములపాలెం మెయిన్‌రోడ్డుకు అనుసంధానం చేసే విధంగా చర్యలు చేపడుతామని కమిషనర్ హామినిచ్చారు. కలెక్టర్ ఆదేశాలు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రతిపాదనలతో ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసరావు, ఏఈ ఉమామహేశ్వరరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ నజీర్, టీడీపీ నాయకులు బండి శ్రీనివాసరావు, యలవల వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, మద్దిబోయన భావన్నారాయణ, శంకరరావు, పాపాయి, బండి మురళీకృష్ణ, బొడ్డు గోవిందు పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీకాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ తదితరులు

రూ.20.24 కోట్లతో తాగునీటి ప్రణాళిక

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
- అదనపు సమ్మర్‌స్టోరేజి ట్యాంక్ ఏర్పాటుకు ప్రణాళిక
- మరో మూడు ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లు ఏర్పాటు
- ఇకపై ప్రతిరోజు తాగునీరు సరఫరా


తాగునీటి పథకాలపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూలై 30 : బాపట్ల జిల్లా కేంద్రంలో పెరుగుతున్న పట్టణ జనాభాను దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య పరిష్కారానికి పెద్ద ఎత్తున ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రజా ఆరోగ్యశాఖ, మున్సిపల్ అధికారులు, సిస్ట్ కన్సల్టెన్సీ వారితో తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే సమీక్షించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉప్పరపాలెంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి అవసరమైన పైపులైన్ ఏర్పాటుకు ఇతర పనులకు అమృత్-2.0 కింద 15 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అదేవిధంగా పెయింటర్స్ కాలనీ, ప్యాడిసన్‌పేట లేఅవుట్, బేతనీకాలనీలలో మూడు ఓవర్‌హెడ్‌ట్యాంక్‌ల నిర్మాణానికి రూ.5.24 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మొత్తం 20.24 కోట్ల రూపాయలు వెచ్చించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా అదనపు సమ్మర్ స్టోరేజి ట్యాంక్ ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు చేసినట్లు వివరించారు. పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రోజుమార్చి రోజు తాగునీరు సరఫరా చేసేవారని ఇకపై ప్రతిరోజు నీటిని సరఫరా చేయనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు.

పట్టణాభివృద్ధికి రూ.67 లక్షలు మంజూరు

పట్టణంలోని డ్రైనేజీలు, శానిటేషన్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు తొలివిడతగా రూ.67 లక్షలు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. డ్రైనేజీలు ఆధునీకరించటంతోపాటు అత్యవసరమైన ప్రాంతాలలో ప్రాధాన్యత ప్రకారం పనులు చేసేందుకు వీటిని వెచ్చించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని అనేక కట్టడాలకు పన్ను వసూళ్ళల్లో కొంత తేడా ఉన్నట్లు గుర్తించామని వాటిని సరిచేయించి ఆదాయం పెంచుతామన్నారు. కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన పన్ను వసూళ్ళు చేసి అప్పులలో ఉన్న మున్సిపాలిటికి ఆదాయం వనరులు పెంచి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కృషితో పురపాలక సంఘానికి రూ.67 లక్షలు రావటం సంతోషదాయకమన్నారు. దీనివల్ల వర్షాకాలంలో ప్రజలకు సమస్యలు తలెత్తకుండా డ్రైనేజీలు, శానిటేషన్ పనులు నిర్వహిస్తారన్నారు. సమావేశంలో సిస్ట్ కన్సల్టెన్సీ ఎండీ అశోక్‌రాజు, ప్రసాద్, ప్రజారోగ్యశాఖ ఈఈ ఆర్‌పి శ్రీనివాస్, మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసరావు, సర్వేయర్ శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన పథకం డొక్కా సీతమ్మ పేరుతో అమలు

పిట్టలవానిపాలెం, జూలై 30 : గత ప్రభుత్వంలో పాఠశాలలో విద్యార్థులకు అందించే జగనన్న గోరుముద్ద పథకాన్ని మార్పు చేసి కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యాశాఖా ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పేరుతో అమలు చేస్తున్నట్లు పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చందోలు గ్రామపంచాయతీ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే నూతన మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఆయన తెలిపారు. పాఠశాలలోని మౌలికసదుపాయాలతోపాటు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సమగ్ర విద్యాబోధనలో విద్యార్థులకు ఉపాధ్యాయులు మంచి తర్ఫీదు ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు, ఎండీఎం నిర్వాహకులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వరస్వామికి నరేంద్రవర్మ ప్రత్యేక పూజలు

బాపట్ల, జూలై 30 : పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో కలిసి పాల్గొని పూజలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంపై హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ శ్రేణులు 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. రాష్ట్రంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని స్వామివారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గిడుగు సోమయ్య, వక్కలగడ్డ శ్రీనివాసరావు, కొలను మోహన్, శ్రీకాంత్, రమణబాబు, బి.బాబునాగేంద్ర, నారాయణమూర్తి, కిషోర్‌చౌదరి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, అర్చకులు విఖనసమూర్తి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


పాతబస్టాండ్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, పార్టీ శ్రేణులు

క్రియాశీలక సభ్యత్వం.. భద్రమైన భవితవ్యం : జనసేన

బాపట్ల, జూలై 30 : జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకోవటం ద్వారా భద్రమైన భవితవ్యం ఉంటుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. పట్టణంలోని పాతబస్టాండ్ కూడలిలో మంగళవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో జనసైనికులకు సభ్యత్వాలు అందజేశారు. జనసైనికులకు అండగా ఉండాలని అధినేత, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుంటుపల్లి తులసీకుమారి, విష్ణుమొలకల చంద్రమోహన్, కారుమూరి ఆంజనేష్, గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్ర, ఆరమళ్ళ సుజిత్, ధర్మారావు, బాలాజి, శ్రీనివాసరావు, రామారావు, కొట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు స్ఫూర్తిదాతల పేర్లు పెట్టటం హర్షణీయం : నామన

బాపట్ల, జూలై 30 : రాష్ట్రప్రభుత్వం విద్యాశాఖలోని పథకాలకు పలువురు స్ఫూర్తిప్రదాతల పేర్లు పెట్టటం హర్షణీయమని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్‌లు తీసుకున్న నిర్ణయాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన జనసేన క్రియాశీలక సభ్యత్వం ఆగస్టు 5వ తేదీ వరకు పొడిగించటం జరిగిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు హుస్సేన్‌బేగ్, విష్ణుమొలకల చంద్రమోహన్, ఆరమళ్ళ సుజిత్, షేక్.కరీముల్లా, షేక్.మున్నా, పడమటి ధర్మారావు, ఊసా ప్రసాద్, పర్వతరెడ్డియలమంద, కొక్కిలిగడ్డ వంశీ, వసంతరావు, వంశీకుమార్, నామన శ్యామ్‌కుమార్, కాటూరి రత్నకుమార్, సోమన సందీప్ పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో ఎంతో ప్రయోజనం

అమృతలూరు, జూలై 30 : విత్తన శుద్ధి ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ అన్నారు. అమృతలూరులో నాట్లును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఆనంతరం రామకృష్ణ మాట్లాడుతూ నాట్లు వేసే ముందు సూడోమోనాస్ లేదా బీజామృతంలో విత్తన శుద్ధి చేయడం వలన చీడ పీడలు అరికట్టవచ్చన్నారు. సకాలంలో యాజమాన్య చర్యలు తీసుకోవడం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. బాపట్ల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాధాకృష్ణ వరి సాగు పద్ధతులపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర డీడీఏ విజయనిర్మల, వాణిశ్రీ, ఏవో లోకేశ్వరి, ఏఈవో శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

కొల్లూరు, జూలై 30 : పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేశారు. మండల పరిధిలోని జువ్వలపాలెం పాల సొసైటీ పరిధిలోని ఉత్పత్తిదారులకు సంగం డెయిరీ అందించిన రూ.100కు రూ.4లు సొసైటీ తరుపున రూ.2.50 మొత్తం రూ.6.50 బోనస్‌గా రూ.లక్షా 65 వేల 543లు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ జిఎల్‌జి భగవాన్, సొసైటీ అధ్యక్షురాలు వేములపల్లి రాజేశ్వరమ్మ, డెయిరీ మేనేజర్ యలవర్తి గోపీకృష్ణ, కో-ఆర్డినేటర్ అద్దంకి నవీన్, సూపర్‌వైజర్ గోపిచంద్, కార్యదర్శి భూపతిబాబు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, జూలై 30 : అంగన్‌వాడీలు నిబద్ధతతో విధులు నిర్వహించాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ కోరారు. పల్లపట్ల ప్రాజెక్టు అంగన్‌వాడీల వర్కర్స్ అండ్ హెల్పర్స్ మంగళవారం శివప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలను విన్నవించారు. అంగన్‌వాడీలలో నెలకొన్న సమస్యలను మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్ళి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి రెండునెలలు కావస్తుందని, సమస్యలు పరిష్కారమయ్యేలా అధికారులతో కూడా చర్చించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

గజ ఈతగాళ్ళ సేవలు అభినందనీయం

బాపట్ల, జూలై 30 : సముద్రతీరప్రాంతంలో యాత్రికుల సంరక్షణకు విశేష కృషి చేస్తున్న గజఈతగాళ్ళ సేవలు అభినందనీయమని అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ అన్నారు. సూర్యలంక తీరంలోని గజ ఈతగాళ్ళకు మంగళవారం ఫౌండేషన్ తరుపున స్విమ్మింగ్‌డ్రస్‌లు అందజేశారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వంగపాటి శివ, సభ్యులు పి.బాలకృష్ణ, చేజర్ల సతీష్, గొర్ల ఆంజనేయులు, పులిగడ్డ శ్యాంప్రసాద్, కర్పూరపు శ్రీనివాసరావు, సోమశేఖర్, మెరైన్‌సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

బాపట్ల, జూలై 30 : పట్టణంలోని శాంతినగర్‌లో విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. జంపని శ్రీనివాసరావు అనే యువకుడు మంగళవారం ఉదయం పళ్ళుతోముకునేందుకు గానుగపుల్ల విరుచుకునేందుకు చెట్టు వద్దకెళ్ళి కొమ్మ వంచగా పక్కనే ఉన్న కేబుల్ వైర్ తగిలి దానికి అనుకొని ఉన్న జీఏ వైర్‌లో విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గురయ్యాడు. స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తీసుకెళ్ళగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పట్టణ ఎస్సై రజాక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభ్యంతరకర పోస్టింగ్‌లపై ఫిర్యాదు

కొల్లూరు, జూలై 30 : ఓ యువకుడు సెల్‌ఫోన్ స్టేటస్‌లో అభ్యంతరకర పోస్టింగ్ చేయడంతో మహిళ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...రాష్ట్రంలో గుర్తు తెలియని ప్రదేశంలో ఓ వ్యక్తి అంగన్‌వాడీ కార్యకర్త పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని, ఆ సంఘటనను ప్రస్తావిస్తూ ఓ యువకుడు తన సెల్‌ఫోన్ స్టేటస్‌లో అభ్యంతరకర వ్యాఖ్యలు పోస్టింగ్ చేయడంతో ఓ కార్యకర్త స్పందించి పోలీసులకు లిఖిత పూర్వక ఫిర్యాదు అందించింది. అంగన్‌వాడీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు ఈ విధంగా పోస్టింగ్‌లు స్టేటస్‌లో పెట్టడంతో అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆ యువకుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది. అయితే కార్యకర్త పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై గాని ఆ సంఘటన ఎప్పుడు, ఎక్కడ జరిగిందనే విషయం ఫిర్యాదులో పేర్కొనలేదని ఎఎస్ఐ అర్జున్ తెలిపారు. ఫిర్యాదుపై విచారణ చేపట్టినట్లు ఆయన చెప్పారు.

ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారి

- నాలుగు సంవత్సరాలలో ఏడుగురు మృత్యువాత
- గతంలో రహదారి వెంట తాడిచెట్టుని ఢీకొని ఇద్దరు మృతి
- దమ్మనవారిపాలెం సమస్యకు పరిష్కారం చూపాలని కలెక్టర్‌కు వినతి

కర్లపాలెం, జూలై 30 : మండలంలోని దమ్మనవారిపాలెం రహదారి ప్రతి సంవత్సరం ప్రమాద ఘంటికలు మోగిస్తూ ప్రాణాలు బలికొంటున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రమాద సమయంలో హడావుడి చేస్తున్నారే తప్ప రహదారి సమస్యపై దృష్టిపెట్టిందేలేదని పలుగ్రామాల ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని యాజలి జాతీయ రహదారి నుంచి దమ్మనవారిపాలెం వెళ్ళే ప్రధాన రహదారి సింగిల్ రోడ్డు కావటం, రహదారికి ఇరువైపుల తాడిచెట్లు రోడ్డును అనుకొని ఉండటం, రెండు మలుపులతో రహదారి మూసుకుపోవటం, ప్రయాణికులు ఎదురు వాహనాలను ఢీకొనకుండా తప్పించబోయి తాడిచెట్లను ఢీకొని ప్రాణాలు కోల్పోవటం పరిపాటిగా మారింది. 2020 నుంచి ప్రతి సంవత్సరం ఇదే ఇరుకు రహదారిలో సంవత్సరానికి ఒకరు చొప్పున 2023 వరకు చనిపోగా ఆదివారం ఈ రహదారిలో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి పొలంలోకి ట్రక్కు తిరగబడి ముగ్గురు విగత జీవులయ్యారు. రహదారికి ఇరువైపుల బరమ్స్ లేకపోగా రహదారికి సుమారు 5 నుంచి 6 అడుగుల లోతులో (పల్లంలో) పొలాలు ఉన్నాయి. రహదారిపై ప్రయాణం చేస్తూ ఏమాత్రం ఆదమరిచిన ప్రాణాలు గాలిలో కలిసిపోయినట్లేనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. బాపట్ల ఎమ్మెల్యే, కలెక్టర్ చొరవ తీసుకొని ప్రమాద రహదారిని అనుకొని ఉన్న తాడిచెట్లు తొలిగించి రహదారి పెద్దది చేయాలని మండల ప్రజానీకం కోరుతున్నారు. ఈ మేరకు దమ్మనవారిపాలెం సర్పంచ్ గుర్రపుసాల వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు.


దమ్మనవారిపాలెం రహదారిని అనుకొని ఉన్న తాడిచెట్లు


పట్టణంలోని మౌంట్‌ఫోర్టుస్కూల్ సమీపంలోని కంపోస్టుయార్డును పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు మంత్రి సోదరుడు శివప్రసాద్

కంపోస్టు యార్డులోని వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు

రేపల్లె, జూలై 30 : పట్టణంలోని మౌంట్‌ఫోర్టు స్కూల్ ప్రాంతంలో ఉన్న కంపోస్టు యార్డులో విపరీతంగా చెత్తాచెదారం పోరుకుపోవటంతో సత్వరమే తొలగించే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ కోరారు. పట్టణంలో రోజు సేకరించే చెత్తను కంపోస్టు యార్డులో వేయటంతో భారీగా నిల్వలు పేరుకుపోయాయి. దీంతో చెత్తాచెదారాన్ని అక్కడ నిల్వచేసే పరిస్థితి లేదు. గతంలో చెత్తాచెదారాన్ని రీసైకిల్ చేసేందుకు గుంటూరుకు చెందిన కాంట్రాక్టర్లకు అప్పగించారు. వారు మధ్యలోనే వదిలేసి వెళ్ళటంతో చెత్తాచెదారం విపరీతంగా పేరుకుపోయింది. దీంతో సమీపంలోని పాఠశాల, శ్మశానవాటిక, పంటపొలాల్లో వీచే గాలులకు వ్యర్థాలు పడి ఇబ్బందులకు గురౌవుతున్నారని తక్షణమే పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని రీసైకిలింగ్‌కు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీఆర్ఎస్ శేషాద్రి, మున్సిపల్ సిబ్బంది, మాజీ కౌన్సిలర్లు పంతాని సాయికుమార్, దేవగిరి రవి, ఆర్‌బి ప్రసాద్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా దినోత్సవంపై ప్రచారం

వేమూరు, జూలై 30 : చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫోరం క్రాఫ్ ఆధ్వర్యంలో మండలంలోని బాలల స్నేహ గ్రామాలైన వేమూరు, బలిజేపల్లి, చావలి, కోడిపర్రు, పెరవలిపాలెం, జంపని, పోతుమర్రు, వరహాపురం గ్రామాలలో మానవ అక్రమ రవాణా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఆటో మైక్ అనౌన్స్‌మెంట్ నిర్వహించారు. ఆయా గ్రామాలలో బాలల రక్షణ కమిటీ, బాలల పంచాయతీ అధ్యక్షతన నిర్వహించారు. ఆయా గ్రామాలలో మహిళా సంరక్షణ కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని మానవ అక్రమ రవాణాపై ప్రచార కార్యక్రమం చేశారు. ఎవరైనా తెలియని వ్యక్తులు వచ్చి మాటల్లో పెట్టి ఏదైనా సమాచారం అడిగి తెలుసుకుంటుంటే వెంటనే వారి నుంచి తప్పించుకొని చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 100కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, సచివాలయం సిబ్బంది, బాలల తల్లిదండ్రులు, క్లస్టర్ ఫీల్డ్, కోఆర్డినేటర్లు, కె.కీర్తన, లక్ష్మీ పార్వతి, వలంటీర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వేమూరు మండలంలో మైక్ ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న చిత్రం

మానవ అక్రమ రవాణాను నిర్మూలిద్దాం

బాపట్ల, జూలై 30 : మానవ అక్రమ రవాణాను నిర్మూలిద్దామంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమశాఖ, సొసైటీఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవాసంస్థసంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డిసిపివో పసుమర్తి పురుషోత్తం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ బడుగు కిషోర్, శ్రీప్రియ, శామ్యూల్‌జాన్సన్, శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలంటూ రైతులు విన్నపం


కూచినపూడిలో ఆయిల్ ఇంజన్ల ద్వారా నీరుపెట్టుకుంటున్న రైతులు

రేపల్లె, జూలై 30 : తీర ప్రాంతంలోని నిజాంపట్నం మండలంలో సాగునీరు అందక వెదపొలాలు, నారుమడులు ఎండు పోతున్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలవనరులశాఖాధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పై నుంచి సరిపడానీరు రావటం లేదని దాని కారణంగా ఆలస్యమవుతుందని అధికారులు తెలుపుతున్నారు. నిజాంపట్నం మండలం కళ్ళిపలం, కోనపలం, కూచినపూడి, ప్రజ్ఞం, అడవులదీవి, పల్లపట్ల ప్రాంతాల్లో సాగునీటి కోసం రైతులు పంట ఎండిపోకుండా ఉండేందుకు ఆయిల్ ఇంజన్ మోటార్లు ఏర్పాటుచేసి నారుమడులు, వెదసాగును కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.12 వేలు ఖర్చుపెట్టామని, సాగునీరు అందకపోవటంతో రూ.2 వేలు ఖర్చుపెట్టి మోటార్ ఇంజన్ల ద్వారా సాగునీటిని తోడుకోవాల్సిన పరిస్థితి నెలకొందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 40 వేల ఎకరాలుపైనే వరి సాగుకు నారుమడులు కొంత భాగం వెదపద్ధతిలో విత్తనాలు చల్లుకున్న పరిస్థితి నెలకొందని, నీరు అందకపోవటంతో వేసిన పంట ఎండుముఖం పడుతుందని తక్షణమే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కలుపు నివారణపై దృష్టి సారించాలి

భట్టిప్రోలు, జూలై 30 : వెద పద్ధతిన వరి సాగు చేసిన రైతాంగం కలుపు నివారణపై దృష్టి సారించాలని రేపల్లె వ్యవసాయ సంచాలకులు ఆర్. విజయ్ బాబు సూచించారు. వెద పద్ధతిన సాగు చేసిన వరి పంట పొలాలను మంగళవారం సందర్శించి రైతాంగానికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వెదసాగులో కలుపు అధికంగా ఉందన్నారు. నామిని గోల్డ్ ఒక ఎకరానికి 80 - 100 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ 10 శాతం, క్లోరిమ్యూరాన్ ఇథైల్ 10 శాతంను ఒక ఎకరాకు 8 గ్రాములు 5,6 ట్యాంక్‌ల వరకు పిచికారీ చేయాలని సరైన మోతాదును, సరైన సమయంలో స్ప్రే చేయుట వలన కలుపు నివారణ సులువుగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ జి. మీరయ్య, ఏఈఓ వి. స్వప్న, వీఏఏ పి రత్నరాజు, ఎంపీఈఓలు నరేష్ తదితరులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ సంచాలకులు విజయ్‌బాబు

● రేపల్లె, జూలై 30 : వెద పద్ధతిలో గింజలను విత్తటం వలన కలుపు మొక్క లు వరి గింజలతో పాటు మొలకెత్తుతాయని కలుపుమందులు తప్పని సరిగా వాడాలని రేపల్లె మండల ఇన్‌చార్జ్ వ్యవసాయశాఖాధికారి ఆర్.విజయ బాబు తెలిపారు. రైతులకు మంగళవారం పలు సూచనలు చేశారు. వెదపద్ధతిలో సాగు చేసిన రైతులు కలుపుమొక్కలు బారిన పడకుండా ముందస్తుగానే చర్య లు తీసుకుంటే తరువాత సమస్యలు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు. మూడు నుంచి ఐదు రోజుల మధ్య ఆక్సిల్‌డయాగ్జిల్ 30 గ్రాములు లేదా ప్రిటిలాఫ్లోర్ సేపనర్ 400 మి.లీ, పైరజోసల్ఫ్యూరాన్ ఈథైల్ 80 గ్రాములను ఎకరాకు 20 కిలోల పొడి ఇసుకతో కలిపి పలచని నీటిమీద చల్లుకోవాలని సూచించారు. 8 నుంచి 12 రోజులకు పైరజోసల్ఫ్యూరాన్ ఈథైల్ 80 నుంచి 100 గ్రాములు, ఈథాక్సీసల్ఫ్యూరాన్ 50గ్రాములు ఎకరాకు చొప్పున పిచికారి చేయాలని సూచించారు.

విశ్రాంతి ఉపాధ్యాయిని హత్య కేసులో వీడిన మిస్టరీ

కేబుల్ టెక్నీషియన్‌ను పట్టుకున్న పోలీసులు

డబ్బు ఆశతోనే ఘాతుకానికి పాల్పడినట్లు అంగీకరించిన నిందితుడు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ జగదీష్ నాయక్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగదీష్‌నాయక్(ఇన్‌సెట్లో) నిందితుడు అంజనేయులు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూలై 30 : సుమారు 10 రోజులుగా చర్చనీయాంశంగా మిగిలిన విశ్రాంతి ఉపాధ్యాయిని హత్య కేసులో మిస్టరీ వీడింది. పలుమార్లు విచారించినా అందీఅందనట్లు జారుకున్న నిందితుడు కేబుల్ టెక్నీషియన్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈక్రమంలో మంగళవారం రాత్రి ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ జగదీష్ నాయక్ వివరాలు వెల్లడించారు. అమరావతికి చెందిన పిల్లి లలితమ్మ(78) అలియాస్ ధర్మవరపు లలిత తెలుగు ఉపాధ్యాయిని. భర్త వెంకట రామారావు కూడా విశ్రాంతి ఉపాధ్యాయుడు. చాలాకాలం కిందటే ఆయన మృతి చెందారు. వృత్తి రీత్యా చాలాకాలంగా దంపతులు ఈపూరుపాలెం బూదాటివారి వీధిలోని జెండా చెట్టు వద్ద నివాసం ముంటూ స్థిరపడ్డారు. ఈనేపథ్యంలోనే 2004లో స్థానిక బాయ్స్ హైస్కూల్‌లో ఉద్యోగ విరమణ పొంది అప్పటి నుంచి ఆమె ఒంటరిగా ఉంటున్నారు. పెద్ద కుమారుడు కల్యాణ్ ఈశ్వర బాబు ఫ్రాన్స్‌లో ఉద్యోగం, చిన్న కుమారుడు సామ్రాట్ కాలిఫోర్నియాలో ఉద్యోగం, కుమార్తె దోష వర్షిత విజయవాడలో నివాసముండగా, ఆమె భర్త అక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. లలితమ్మ చుట్టు పక్కల వారితో ఎంతో మర్యాదగా ఉండేవారు. ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. ఎంతో ఉన్నతంగా ఉన్న ఈమె ఒంటరిగా ఉండే సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈనెల 23వ తేదీన మధ్యాహ్న సమయంలో సమీపంలోని తోటవారి పాలెం వీవర్స్ కాలనీకు చెందిన కేబుల్ టెక్నీషియన్ పోసా అంజనేయులు టీవీ రిపేర్ చేసేందుకు ఇంట్లోకి వచ్చాడు. ఆ సమయంలో ఒంటరిగా కూరగాయలు కోసుకుంటూ ఉన్న లలితమ్మను చూశాడు. ఆమె వద్ద డబ్బు అధికంగా ఉంటుందని దురాశ చెందాడు. దీంతో ఇంట్లో ఉన్న కత్తితో ఆమెపై దాడి చేసి గొంతులో కత్తి దింపి హత మార్చాడు. ఇంట్లో అన్ని ప్రాంతాల్లో వెదకగా రూ.9500 మినహా నగదు కనిపించలేదు. వాటితోనే సర్దుకుని జారుకున్నాడు. గ్రామంలోనే దర్జాగా తిరుగుతూ టీవీ మరమ్మతులు చేసుకుంటు ఉన్నాడు.

పోలీసులు రంగప్రవేశం

హత్య విషయాన్ని తెలుసుకున్న ఎస్పీ తుషార్ డూడీతో సహా సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు అందరూ రంగంలోకి దిగారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. 100 మందికి పైగా విచారణ చేశారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఎంతో ఉన్నతంగా అభివృద్ధి చెందిన ప్రాంతంలో కనీసం ఒక్క సీసీ కెమెరా కూడా లేకపోవడంతో హత్య కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. దీంతో సుమారు 40 మంది పోలీసులు రంగంలోకి దిగి ఆధారాలు సేకరించే పనిలో సుమారు 10 రోజులుగా మునిగిపోయారు.

నిందితుడిని గతంలోనే పలుమార్లు విచారణ

నిందితుడు పోసా అంజనేయులు అతనితో కలిసి పనిచేసే అశోక్‌ను పలుమార్లు పోలీసులు విచారణ చేశారు. ఈక్రమంలో అంజనేయులు అందీఅందనట్లు జారుకుంటూ పోలీసుల దృష్టిని మరలించాడు. అయితే తిరిగి తిరిగి కేసు మళ్లీ ఇతని చుట్టే తిరుగుతుండడంతో అతడు ఆ రోజు ధరించిన డ్రెస్‌ను సీజ్ చేశారు. వాటిని పరీక్షించారు. అవి అప్పటికే ఉతికి ఉండడంతో పోలీసులకు పరిస్థితి అంతుబట్ట లేదు. ఎట్టకేలకు వీటి శాంపిల్స్ కలెక్ట్ చేసి రెండు దఫాలుగా ల్యాబ్‌కు పంపగా నిర్ధారణ జరిగింది. వెంటనే మంగళవారం నిందితుడుని అరెస్ట్ చేసి, ఘటనకు పాల్పడిన కత్తి, వాహనం, డ్రెస్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసులను, ఎస్‌బీ, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు.

చీరాల బ్యాంకులో సీఐడీ విచారణ

పెద్ద ఎత్తున గోల్డ్ గోల్‌మాల్ చేసిన ఉద్యోగి

రూ. కోటికి పైగా స్వాహా జరిగినట్లు సమాచారం

చీరాలటౌన్, జూలై 30 : చీరాల పట్టణంలోని ఓ బ్యాంకులో మంగళవారం సీఐడీ విచారణ చేపట్టింది. ఈ బ్యాంకులో ఓ ఉద్యోగి రూ. 100 గ్రాముల గోల్డ్‌ను అపహరించి, బంధువుల పేరుతో తిరిగి రూ.కోటికి పైగా రుణం పొందారు. అయితే ఆ బ్యాంకుకు సంబంధించిన ఇద్దరు మేనేజర్‌లు ఆడిటింగ్ నిర్వహించగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. దీంతో వారు విషయాన్ని సీఐడీకి అప్పగించడంతో అధికారులు మంగళవారం విచారణ నిర్వహించారు. ఈక్రమంలోనే సుమారు అరుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు సమాచారం. పూర్తి వివరాలు అధికారులు వెల్లడించాల్సి ఉంది.

ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపిక అయిన అండర్ 19 బాలుర క్రికెట్ జట్టు

మేదరమెట్ల, జూలై 30 : ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 19 క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు పీడీసీఏ ప్రధాన కార్యదర్శి కారుసుల నాగేశ్వరరావు తెలిపారు. కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలోని ఆర్ ఎస్‌సీఏ క్రికెట్‌స్టేడియంలో మూడు రోజులపాటు 29 మంది క్రీడాకారులకు పోటీలు నిర్వహించి వారిలో 16 మందితో కూడిన జట్టును మంగళవారం ఎంపిక చేశామన్నారు. మరో నలుగురిని స్టాండ్‌బైగా తీసుకున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 1వ తేదీ నుంచి మంగళగిరి పేరెచర్ల నరసరావుపేటలో నిర్వహించే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీసీఏ ఉపాధ్యక్షుడు జవహర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా క్రికెట్ జట్టుకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు పోటీల్లో మంచి ప్రతిభ కనబరచాలని కోరారు. కార్యక్రమంలో జీజీ హనుమంతరావు, కొల్లా మధు, కోచ్ వంశీ, ఏసీఏ కోచ్‌లు సుధాకర్ చంద్రశేఖర్, బాబూరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మద్దిపాడు, జూలై 30 : గుర్తు తెలియని వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొని వృద్ధుడు మృతి చెందారు. ఈ సంఘటన మంగళవారం వెంకటరాజుపాలెం సమీపంలో జరిగింది. కొరిశపాడు మండలం దైవాలరావూరికి చెందిన కొప్పోలు అంజయ్య(68) తన బైక్‌పై ఒంగోలు నుంచి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అంజయ్య అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై మహేష్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

4న ఉచిత కంటి వైద్య శిబిరం

ఇంకొల్లు, జూలై 30 : ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 4వ తేదీన ఆదివారం ఏలూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పింఛన్‌ల పంపిణీకి సిద్ధం

ఇంకొల్లు, జూలై 30 : మండలంలోని 13 పంచాయతీలలో 15 సచివాలయాల పరిధిలో 7733 మందికి ఆగస్టు 1వ తేదీన సచివాలయ సిబ్బంది పింఛన్‌లు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. సుమారు రూ.3 కోట్ల 18లక్షల 27వేల రూపాయలు అబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

మోనోడాన్.. నిలువునా ముంచెన్!

నాసిరకం సీడ్‌తో ఆక్వా రైతులకు అపారనష్టం

చెరువుల్లో ఎదుగుదల లేని రొయ్యలు

ఎకరా చెరువుకు రూ.5లక్షలు పోయినట్లే

హేచరీలపై పర్యవేక్షణ కరువు

పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు

జిల్లాలో ఆక్వా రంగం ఒడిదొడుకులకు లోనవుతోంది. సీడ్ మోసంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రొయ్య పిల్లలను ఉత్పత్తి చేసే హేచరీలు రైతులను దెబ్బకొట్టాయి. వారిని నమ్మించి నట్టేట ముంచేశాయి. నాసిరకం సీడ్‌ను సరఫరా చేయడంతో రైతులు రూ.లక్షల్లో పెట్టుబడులు కోల్పోయారు. చెరువులలో రొయ్యలు ఎదుగూబొదుగూ లేకపోవడం, మధ్యలో చనిపోతుండటంతో ఆక్వారైతులు లబోదిబోమంటున్నారు. హేచరీల నిర్వహణపై ప్రభుత్వానికి పూర్తిగా పర్యవేక్షణ లేకపోవటంతో నిర్వాహకులదే ఇష్టారాజ్యం అవుతోంది. రైతులు ఒకపక్క గుల్లవుతుండగా హేచరీల యజమానులు మాత్రం రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. నాసిరకం సీడ్‌తో నష్టపోయిన ఆక్వా రైతులు ప్రభుత్వం సాయం చేయటమా లేక హేచరీల నుంచి నష్టపరిహారం ఇప్పించటమా అనే దిశగా ఉద్యమించడానికి సిద్ధమవుతున్నారు.

ఒంగోలు నగరం, జూలై 30: జిల్లాలోని ఆక్వా రైతులు మళ్లీ కుదేలయ్యారు. ప్రతిసారి వైరస్ వల్లో లేక ధరలు పడిపోవడం వల్లో దెబ్బతినే ఆక్వా రంగం ఈసారి నాసిరకం సీడ్‌తో అతలాకుతలమవుతోంది. కొన్నేళ్లుగా టైగర్ రకం రొయ్యల సాగువైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. వెనామీ రకం రొయ్యలకు డిమాండ్ తగ్గటంతో టైగర్ సాగుపై దృష్టిసారించారు. ఐదేళ్లుగా జిల్లాలో టైగర్ సాగు పెరుగుతూ వస్తోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కొత్తపట్నం, టంగుటూరు, శింగరాయకొండ, ఉలవపాడు, ఒంగోలు, చినగంజాం, నాగులుప్పలపాడు, వేటపాలెం, చీరాల మండలాల్లో దాదాపు 25వేల హెక్టార్లతో ఆక్వా సాగు జరుగుతోంది. ఇందులో సగానికి పైగా టైగర్ రకం రొయ్యలనే రైతులు సాగుచేస్తున్నారు.

ధర ఎక్కువ ... నాణ్యత తక్కువ

మోనోడాన్ రకం సీడ్‌ను హేచరీల యజమానులు రైతులకు ఎక్కువ ధరకే విక్రయిస్తున్నారు. ఇతర రకం సీడ్ 50 గ్రాములలోపు బరువు పెరుగుతుండగా, మోనోడాన్ రొయ్య గరిష్ఠంగా 100 గ్రాముల బరువు పెరుగుతుంది. దీంతో సహజంగానే ఆ రకం రొయ్యలకు మార్కెట్లో డిమాండ్ అధికం. దీంతో ఎక్కువ మంది రైతులు ఆ రకం రొయ్యల సాగుకే మొగ్గుచూపుతున్నారు. దీంతో హేచరీల యజమానులు సీడ్ ధరలను అమాంతం పెంచేసి విక్రయిస్తున్నారు. సీడ్ ఒక్కో పిల్ల రేటు 90పైసలకు గరిష్ఠంగా విక్రయిస్తున్నారు. ఈ లెక్కన ఆక్వా రైతులు సీడ్ కొనుగోలుకే రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఇంత ధర పెట్టి కొనుగోలు చేసినా రైతులకు నాసిరకం సీడ్‌నే సరఫరా చేస్తున్నారు. తెచ్చిన పిల్లల్లో 20శాతం మాత్రమే చెరువుల్లో బతుకుతున్నాయి. సాధారణంగా మోనోడాన్ రకం సీడ్‌ను ఆరు నెలల పాటు పెంచితే 100 గ్రాములకు పెరుగుతాయి. ఇప్పుడు ఆరు నెలలకు 50 గ్రాముల బరువు కూడా పెరగటం లేదు. దీంతో రైతులు మేత, ఇతర నిర్వహణ ఖర్చులు పెరిగిపోయి తీవ్రంగా నష్టపోయారు. ఎదుగుదల లోపించటంతోపాటు వ్యాధులు కూడా చుట్టుముడుతున్నాయి. వైట్‌స్పాట్, వైట్‌గట్, ఈహెచ్‌పీ వైరస్‌లు రొయ్యలకు సోకుతున్నాయి. దీంతో చెరువును మధ్యలోనే తీసెయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

మోనాడాన్.. చనిపోతున్నాయి

జిల్లాలో రైతులు నెల్లూరు, గూడూరు, కరేడు ప్రాంతాల నుంచి రైతులు మోనోడాన్ కంపెనీ రకం రొయ్య పిల్లలను తెచ్చి సాగు చేపట్టారు. అయితే మోనోడాన్ వేసిన చెరువుల్లో పిల్లలు చనిపోతున్నాయి. సగానికి సగం కూడా చెరువులో ఉండటం లేదు. బతికిన సగం పిల్లల్లో కూడా ఎదుగుదల లేకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సాధారణంగా వెనామీ రకం సీడ్ చెరువుల్లో లక్షల్లో వేస్తారు. మోనోడాన్ రకం సీడ్ అయితే ఎకరం విస్తీర్ణంలో 30వేల సీడ్ మాత్రమే వేస్తారు. వేసినవి కూడా మొత్తం బతకకపోవటం, బతికి ఉన్న రొయ్యల్లో ఎదుగుదల లేకపోవటంతో రైతులలో అయోమయం నెలకొంది. వెనామీ రకం రొయ్యలను 100 కౌంట్‌లో తీసినా రైతులకు గిట్టుబాటు అవుతోంది. అదే మోనోడాన్ రకం రొయ్యలను 30లోపు కౌంటులో తీస్తేనే గిట్టుబాటు అవుతుంది. అంత కౌంట్‌కు తీసుకు రావాలంటే రైతులు ఐదు నెలలకుపైగా చెరువుల్లో ఉంచి మేత వేయాల్సి వస్తోంది. అయినా ఆ కౌంట్‌కు ఎదగకపోవటం, పెట్టుబడి పెరగడంతో రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. జిల్లాలో టైగర్ రకం రొయ్యల్లో మోనోడాన్ కంపెనీకి చెందిన పిల్లలు సాగు చేసిన రైతులు భారీగా నష్టపోయారు. గత రెండేళ్లుగా నష్టాల్ని చవిచూస్తూనే ఉన్నారు. ఒక్కో ఎకరాకు రూ.5లక్షల మేర నష్టపోయారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం జిల్లాలో వర్షాకాలం పంట సాగుకు సమాయత్తం అవుతుండగా నాణ్యమైన సీడ్ కోసం రైతులు దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. టైగర్ రకం సాగు చేయాలంటే హేచరీల నుంచి నాసిరకం సీడ్ అమ్ముతున్నారంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు.



చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం

రొయ్యల రైతులకు నాసిరకం సీడ్‌ను సరఫరా చేస్తూ నిలువునా మోసం చేస్తున్నారు. అయితే ఈ మొత్తం వ్యవహారంపై పర్యవేక్షణ చేయాల్సిన మత్స్యశాఖ అధికారులు గాని, కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ గాని ఏ మాత్రం పట్టించుకోవటం లేదు. తరచూ హేచరీలను తనిఖీ చేస్తూ నాసిరకం సీడ్ తయారీని అరికట్టాల్సిన అధికారులు ఆ దిశగా ఏమాత్రం చర్యలు చేపట్టటం లేదు. జిల్లా మత్స్యశాఖకు తగినంత మంది అధికారులు, సిబ్బంది ఉన్నా హేచరీల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని రైతులు విమర్శిస్తున్నారు.

1న రొయ్యల సంఘం రైతులు...

హేచరీల యజమానులతో ప్రత్యేక సమావేశం

రైతులకు నాసిరకం సీడ్‌ను విక్రయించిన హేచరీల నుంచి రైతులకు నష్టపరిహారం ఇప్పించాలనే డిమాండ్ జిల్లా ఆక్వా రైతుల సంక్షేమ సంఘం నుంచి వస్తున్న నేపథ్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించారు. హేచరీల యజమానులు, ఆక్వా రైతు సంఘం నాయకులతో ఆగస్టు ఒకటో తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లో జరిగే ఈ సమావేశంలో రైతులు, అధికారులు, హేచరీల నిర్వాహకులు పాల్గొననున్నారు.

మరో వేసవి!

జిల్లావ్యాప్తంగా పెరిగిన ఎండలు

ఆపై వేడిగాలులు

ఒంగోలులో 38.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

నాలుగైదు రోజుల్లోనే ఐదు డిగ్రీలు పెరుగుదల



ఎండదెబ్బకు గొడుగుతో వెళ్తున్న మహిళ

ఒంగోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తూ కొన్నిచోట్ల వరదలు కూడా ముంచెత్తుతున్నాయి. కానీ జిల్లాలో మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. జిల్లాలోని అధిక ప్రాంతాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఒకరకంగా వేసవిని తలపిస్తూ ఎండలు కాస్తున్నాయి. మరో వేసవి కాలం వచ్చిందా అన్నట్లుగా ఎండల తీవ్రతతోపాటు వడగాలులు వీస్తున్నాయి. సాధారణంగా ఉండాల్సిన దాని కన్నా గత వారంరోజులుగా జిల్లాలో అధికంగా ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. నాలుగురోజుల వ్యవధిలో ఒంగోలు నగరంలో ఏకంగా ఐదు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఈనెల 27న ఒంగోలులో 34డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా మంగళవారం ఏకంగా 38.8డిగ్రీలు నమోదైంది. సాధారణంగా జిల్లాలో ఈ సమయంలో వాతావరణం చల్లగా ఉంటుంది. పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30 నుంచి 34 డిగ్రీల లోపుగా ఉంటుంటాయి. తరుచూ జల్లులు పడుతూ వాతావరణం చల్లగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలలో అయితే వాతావరణం మరింత ఆహ్లాదకరంగా ఉంటుంది. ఖరీఫ్ సీజన్ పంటలు సాగుతోపాటు పశుగ్రాస పైర్లు ఇతరత్రా వాటితో గ్రామాల్లోని పొలాలు పచ్చగా ఉంటాయి. అదే పట్టణాలలో అయితే రెండు, మూడు రోజులకు ఒకసారి అయినా జల్లులు పడుతూ జనజీవనం కొంత ఇబ్బందికరంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం జిల్లాలో అందుకుభిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. ప్రత్యేకించి నాలుగైదు రోజులుగా పరిస్థితి పూర్తిగా మారింది. జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో వానజాడ లేకపోగా ఎండల తీవ్రత పెరిగింది. పలుచోట్ల 40డిగ్రీలకు చేరువలో ఎండలు కాస్తుండటంతో పాటు వడగాలులు కూడా వీస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్న సమయంలో సంతనూతలపాడు, చీమకుర్తి, పొన్నలూరు మండలాల్లో 38 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉండగా సగానికిపైగా మండలాల్లో 37డిగ్రీల కన్నా అధికంగా నమోదయ్యాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండల తీవ్రత ఉంటుంది. ఎండలకు వేడిగాలులు, ఉక్కపోత తోడు కావడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వానలు కురవాల్సిన సమయంలో మరో వేసవికాలం వచ్చిందా అన్న చర్చ సర్వత్రా జరుగుతుండగా వర్షాలు లేక పంటల సాగు కూడా ముందుకు సాగడం లేదు.

విద్యా పథకాలకు పేరు మార్పు

ఒంగోలు(విద్య), జూలై 30 : పాఠశాల, కళాశాల విద్యలో విద్యార్థులకు అమలుచేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాల పేర్లను కూటమి ప్రభుత్వం మార్చేసింది. గత ప్రభుత్వంలో జగనన్న పేరుతో అమలు జరిగిన ఈ పథకాలకు ప్రభుత్వం మహనీయుల పేర్లు పెట్టి వారిని గౌరవించింది. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేలా కూటమి ప్రభుత్వం మూడు పథకాలకు పేర్లు నిర్ణయించింది.

- పాఠశాల విద్యార్థులకు ఇప్పటి వరకు జగనన్న గోరుముద్ద పేరుతో అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం పేరును డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా మార్పు చేశారు.
- జగనన్న విద్యాకానుక పేరుతో విద్యార్థులకు అందిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్రగా మార్పు చేశారు.
- జగనన్న ఆణిముత్యాలు పేరుతో విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను అబ్దుల్‌కలాం ప్రతిభా సేవా పురస్కారంగా పేర్లను ప్రభుత్వం మార్పు చేసింది.

మధ్యాహ్న భోజన మెనూ మార్పు

పాఠశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన మెనూను ప్రభుత్వం మార్చింది.

- సోమవారం కూరగాయల పలావ్, కోడిగుడ్ల కూర, వేరుశనగ బెల్లం చిక్కి
- మంగళవారం పులిహోర, దొండకాయ పచ్చడి, రాగిజావ, ఉడికించిన కోడిగుడ్డు
- బుధవారం కూరగాయల అన్నం, ఆలుకుర్మ, ఉడికించిన కోడిగుడ్లు, వేరుశనగ బెల్లం చిక్కి
- గురువారం సాంబర్ బాత్/లెమన్ రైస్, టమోటా పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు
- శుక్రవారం అన్నం, ఆకుకూరపప్పు, ఉడికించిన కోడిగుడ్డు, వేరుశనగ బెల్లంచిక్కి
- శనివారం ఆకుకూర అన్నం, పప్పుచారు, రాగిజావ, స్వీట్ పొంగల్

వంట నిర్వహకులు, హెచ్‌ఎంల అనుమతిలో విద్యార్థులకు సరిపోయేలా అన్నం, గుడ్లు, చిక్కిలు ఇవ్వాలి. వంట చేసే ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచాలి. వంటకు ముందు నిర్వాహకులు యూనిఫాం ధరించి వంట చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

మామాకోడళ్ల మధ్య ఘర్షణ

ఆగ్రహించిన ఆమె బంధువులు

మామ కూతురి ఇంటికి వెళ్లి వాగ్వివాదం

అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఏఎస్సై

ఆయన దాడిచేశారని రోడ్డెక్కిన కోడలి బంధువులు

ఎస్సై చొరవతో ఆందోళన విరమణ

పరస్పర కేసులు నమోదు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్సై టి. శ్రీరామ్


సింగరాయకొండ, జూలై 30 : మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో సోమవారం రాత్రి మామ, కోడలు ఘర్షణ పడ్డారు. కుటుంబ తగాదా కాస్తా చివరకు పోలీసుల వైపు మళ్లింది. ఎస్సై టి.శ్రీరాం కథనం మేరకు.. కుటుంబ కలహాల నేపథ్యంలో మామ మాలకొండయ్య, కోడలు సుకన్య మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా మాలకొండయ్య కర్రతో సుకన్యను కొట్టడంతో కంటి కింద రక్తగాయమైంది. దీంతో ఇరువురూ రాత్రి 11 గంటల సమయంలో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడానికి పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులు ఆసుపత్రికి వెళ్లాలని సూచించగా ఉదయాన్నే మళ్లీ వస్తామని వెనుదిరిగి ఇంటికి చేరుకున్నారు. సుకన్యపై దాడి విషయాన్ని తెలుసుకొని మంగళవారం ఉదయం ఆమె బంధువులు వెంకటేశ్వరకాలనీకి చేరుకున్నారు. మాలకొండయ్య కోసం వెతుకుతూ కాలనీలోని ఆయన కుమార్తె ఇంటికి వెళ్లారు. అక్కడ ఆమెకు, సుకన్య బంధువుల మధ్య వివాదం జరిగింది. దీంతో ఆమె విషయాన్ని తన భర్త మురళికి ఫోన్ చేసి చెప్పింది. ఆయన వెంటనే డయల్ 100కు ఫోన్ చేశారు. దీంతో పోలీసులు వెంకటేశ్వరకాలనీకి చేరుకున్నారు. ఆసమయంలో పోలీసుల వెంట ఉన్న మురళిపై సుకన్య బంధువులు దాడికి ప్రయత్నించారు. అక్కడే ఉన్న ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా వారించే క్రమంలో కొందరిని చొక్కాపట్టుకొని పక్కకు లాగారు. పోలీసుల ముందే దాడికి పాల్పడితారా అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇరువర్గాల వారికి సర్దిచెప్పి తిరిగి స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు ఒక వైపు ఒత్తాసు పలుకుతున్నారని, ఏఎస్సై మహబూబ్‌బాషా తమపై దాడిచేశారని ఆరోపిస్తూ సుకన్య బంధువులు వెంకటేశ్వర కాలనీ ఎదురు ఉన్న ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. ఏఎస్సైను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీరాం హుటాహుటిన అక్కడికి చేరుకొని సుకన్య, వారి బంధువులతో మాట్లాడారు. స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదుచేస్తే న్యాయం చేస్తానని సర్దిచెప్పారు. దీంతో శాంతించిన వారు ధర్నాను విరమించారు. అనంతరం సుకన్య, మాలకొండయ్యను కందుకూరు ఏరియా ఆసుపత్రికి పంపించారు. ఆసుపత్రిలో ఇరువురూ ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు పరస్పర కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంతా ఖాళీనే..

కాలక్షేపం చేస్తున్న ఎయిడెడ్ టీచర్లు

ఆయా స్కూళ్లలో పిల్లల్లేరు

సర్దుబాటును పట్టించుకోని విద్యాశాఖ



ఒంగోలు(విద్య), జూలై 30: జిల్లాలో పిల్లలు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు ఖాళీగా ఉంటూ కాలక్షేపం చేస్తున్నారు. పాఠాలు చెప్పేందుకు పిల్లలు లేకపోవడంతో వీరిని ఖాళీగా కూర్చోబెట్టి ప్రభుత్వం జీతాలు చెల్లిస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలల్లో పిల్లలు లేకపోతే వాటిని తాత్కాలికంగా మూసివేసి అక్కడ పనిచేసే టీచర్లను పిల్లలు ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేస్తారు. అయితే విద్యాశాఖ అధికారులు ఆ పనిచేయకపోవడంతో టీచర్లు పాఠశాలల్లోనే ఉంటున్నారు. కొమరోలు, కంభం, గిద్దలూరు మండలాల్లోని కొన్ని ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లలో పిల్లలు లేకపోవడంతో అక్కడి టీచర్లు ఖాళీగానే ఉన్నారు. పిల్లలు లేకపోతే అక్కడి టీచర్లను పిల్లలు ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయమని జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర మండల విద్యాధికారులను ఆదేశించినా ఆచరణలో ఫలితం కనిపించలేదు. ఈ మండలాల్లో సుమారు 20మంది టీచర్లు పిల్లలు లేక ఖాళీగా ఉన్న పాఠశాలలకు కాపలా కాస్తూ అక్కడే తిష్టవేసి కూర్చుంటున్నారు. ప్రతినెల లక్షలాది రూపాయలు జీతాలు చెల్లిస్తూ వారితో పనిచేయించుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. టీచర్ల సంతకాల శ్రమకు జీతాలు చెల్లిస్తూ ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తున్నారు. విద్యాశాఖాధికారి దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

మార్టూరు - పర్చూరు తారురోడ్డు తీరే వేరు





పెద జాగర్లమూడి నుంచి యద్దనపూడి మధ్య కుంగిన రోడ్డు.. యద్దనపూడి - యనమదల గ్రామాల మధ్య దెబ్బతిన్న రహదారి.. యనమదల కూడలి వద్ద ఏర్పడిన పెద్ద గుంత

- మూడుచోట్ల దెబ్బతిన్న వైనం
- భారీ వాహనాలవల్లే నష్టం
- చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి

మార్టూరు, జూలై 30 : రోడ్డుకు ఇరువైపులా పొలాలు.. మధ్యలో అక్కడక్కడా గ్రామాలు.. ఈ గ్రామాలలో రోడ్డుకు ఇరువైపులా భవనాలు.. ఇదీ మార్టూరు నుంచి డేగరమూడి యనమదల గ్రామాల మీదగా యద్దనపూడి నుంచి పర్చూరుకు చేరే తారు రోడ్డు రహదారి. ఈ రహదారిలో మార్టూరు నుంచి పర్చూరుకు దూరం 22 కి.మీ. అరగంట సేపు ప్రయాణం. ఈ రహదారిలో గతంలో ఐదేళ్ల కిందట తారురోడ్డు వేశారు. పొలాల మధ్య ఈ రహదారిపై ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే గత రెండేళ్ల నుంచి ఈ రహదారి మరమ్మతులకు గురవుతున్నది. కొన్నిచోట్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. మార్టూరు ప్రాంతం నుంచి కంకర, ఎర్ర మట్టిని టిప్పర్లు, డంపర్లతో భారీ వాహనాలు పర్చూరు ప్రాంతానికి రోజూ తరలిస్తున్నాయి. దాంతో ఈ వాహనాలు కారణంగా రోడ్డు దెబ్బతింటున్న మాట వాస్తవం. కానీ ఈ భారీ వాహనాలను ఆపడానికి అవకాశం లేదని వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్థులు అంటున్నారు. రోజూ భారీ వాహనాలు కారణంగా రోడ్డు దెబ్బతింటున్నా ఏమీ చేయలేకపోతున్నామని ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ రహదారిలో మూడు ప్రాంతాలలో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. వాటిలో యద్దనపూడి నుండి పెద జాగర్లమూడి వరకు యద్దనపూడి గ్రామ శివార్లు నుంచి పెద జాగర్లమూడి వరకు రోడ్డు చాలా చోట్ల తారుకోసుకు ఎ ోయింది. చాలాచోట్ల రోడ్డు కుంగిపోయింది. ఒక చోట ఏకంగా 100 అడుగులకుపైగా దూరం రోడ్డుపై తారుపూర్తిగా లేచిపోయి అడుగున ఉన్న కంకర రాళ్లు కూడా బయటపడ్డాయి. ఈ ప్రాంతంలో ఇంకా రోడ్డు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. వర్షాలు కురిసినపుడు ఈ రోడ్డుపై ఇంకా పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. భారీ వాహనాలు కారణంగా ఈ ప్రాంతంలోని రహదారి మున్ముందు మరింతగా భారీగా దెబ్బతినే అవకాశం ఉందని ఈ రోడ్ ద్వారా ప్రయాణించే ప్రయాణికులు అంటున్నారు.

యద్దనపూడి నుంచి యనమదల

యద్దనపూడి నుంచి యనమదల మధ్య దూరం రెండు కిలో మీటర్ల లోపే ఉంటుంది. ఇక్కడ రోడ్డు సింగిల్ రోడ్డు కావడంతో రోడ్డుపై ఏర్పడిన గుంతలు కారణంగా రోడ్డు మార్జిన్ దిగడానికి వాహనదారులు ఇష్టపడరు. అదేవిధంగా భారీ వాహనాలు వెళ్లే సమయంలో కూడా మిగిలిన వాహనదారులు మరింతగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలు, ట్రాక్టర్లు నడిపేవారు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు.

యనమదల నుంచి చింతపల్లిపాడుకు

యనమదల-చింతపల్లిపాడు వరకు మధ్య దూరం కిలో మీటరు మాత్రమే ఉంటుంది. కానీ ఈ రెండు గ్రామాల మధ్య రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. యద్దనపూడి సెంటర్ వద్ద పెద్ద అగాధాలు ఏర్పడ్డాయి. అంతేగాకుండా యనమదల నుంచి చింతపల్లిపాడు వెళ్లే రోడ్డులో దేవాలయం మలుపు వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. అదేవిధంగా యనమదల ఎస్సీ కాలనీ వద్ద రోడ్డుపై భారీ గుంతల ఏర్పడ్డాయి. మార్టూరు నుంచి పర్చూరుకు వెళ్లే రహదారిలో చెడిపోయిన రోడ్డును బాగు చేయడం ఒక ఎత్తయితే ప్రస్తుతం బాగున్న రోడ్డు చెడిపోకుండా గుంతలు పడకుండా భారీ వాహనాల నుంచి కాపాడుకోవడం ముఖ్యమని ఈ రహదారి పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు భావిస్తున్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

తక్కువ ధరలకు వైద్య సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 30 : ప్రతి శనివారం తక్కువ ధరలకు వైద్య సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టిన శ్రీ కామాక్షి కేర్ హాస్పటల్ యాజమాన్యం, వైద్యులు అభినందనీయులని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. తాడివలస శంకర్ వర్ధంతి సందర్భంగా చేపట్టిన సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కొండయ్య చేతుల మీదుగా తక్కువ ధరలకు వైద్యసేవలందించే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడారు. అనంతరం డాక్టర్ తాడివలస దేవరాజ్ మాట్లాడుతూ తాము అందించే సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య సేవలు, వైద్య పరీక్షల్లో అందిచే రాయితీలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుర్ల వెంకటరావు, గజవల్లి శ్రీనివాసరావు, కొతవరపు జనార్ధనరావు, రత్నిబాబు, వీరయ్య మాస్టారు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన పెంచాలి



మాట్లాడుతున్న ఎన్ఆర్ఈజీఎస్ ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్

అద్దంకిటౌన్, జూలై 30 : ఉపాధి హామీ పథకం ద్వారా అందించే వివిధ రకాల పండ్ల తోటల రాయితీలపై రైతులకు అవగాహన పెంచి వాటి విస్తీర్ణాన్ని పెంచేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఉపాధి పథకం జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ పి.కిరణ్ అన్నారు. మంగళవారం అద్దంకి ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో నియోజవర్గంలోని మూడు మండలాల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోలు, ఈసీలు, టీఏలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, హర్టికల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. అద్దంకి నియోజకవర్గంలోని మండలాలలోని గ్రామాలలో ఆయా గ్రామాలలకు అనుకూలమైన పండ్ల మొక్కలు అందించడం వాటిపై వచ్చే రాయితీ, రాబడి వంటి విషయాలపై రైతులకు అవగాహన కల్పించి నియోజకవర్గంలో పంట్ల తోల విస్తీర్ణం పెరిగేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ప్రతి మండలంలో 150 ఎకరాలు తగ్గకుండా అధికారులు అందరు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అద్దంకి, జె.పంగులూరు, బల్లికురవ మండలాల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోలు, ఈసీలు, టీఏలు, విలేజ్ అగ్రికల్చర్, హర్టికల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వంగడాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి ప్రశాంతి

చెరుకూరు (పర్చూరు), జూలై 30 : వంగడాలపై రైతులు అప్రమత్తంగా ఉండడంతోపాటు, నాణ్యమైన వరి విత్తనాలను ఎంపిక చేసుకోవడంలో అవగాహన కల్గి ఉండాలని బాపట్ల ఏరువాక కేంద్రం సమన్వయకర్త బాల మురళీధర్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని చెరుకూరు గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో పలు రకాల వరి వంగడాలపై శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. వరి విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. అనంతరం జడ్పీటీసీ మాజీ సభ్యులు దాసరి ఉషారాణి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించే విధంగా వ్యవసాయాధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎస్.మోహనరావు, వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, విశ్రాంత ప్రొఫెసర్ కారుమంచి విజయకుమార్, పంచాయితీ కార్యదర్శి కొసనా సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

వేటపాలెం పీహెచ్‌సీలో అధికారుల విచారణ

నివేదిక ఆధారంగా చర్యలు చేపడతామన్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ



డాక్టర్ బాలరాజుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సిబ్బంది

వేటపాలెం(చీరాల), జూలై 30 : పీహెచ్‌సీలో డాక్టర్ బాలరాజు, ఫార్మసిస్టు వెంకట ప్రసాద్ మధ్య వివాదం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయమ్మ ఆదేశాల మేరకు విచారణ బృందం వేటపాలెం పీహెచ్‌సీని సందర్శించారు. డీపీఎం డాక్టరు రోహిణి, డీఐవో వెంకటేశ్వరరావు, జిల్లా కోఆర్డినేటర్ ప్రేమపావని విచారణ నిర్వహించారు. డాక్టరు బాలరాజు, ఫార్మసిస్టు వెంకట ప్రసాద్‌ను వేర్వేరుగా విచారణ చేశారు. వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విచారణ నివేదికను డీఎం అండ్ హెచ్‌వోకు అందజేస్తామన్నారు. ఈ క్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మను వివరణ అడగ్గా విచారణ బృందం అందజేసే నిదేదిక ఆధారంగా చర్యలు చేపడతామన్నారు. ఇదిలావుంటే డాక్టర్ బాలరాజు వేధింపుల నుంచి తమకు విముక్తి కల్పించాలని విచారణ అధికారులు ఉన్నప్పుడే సిబ్బంది డాక్టర్ బాలరాజుకు వ్యతిరేకంగా నిరసన తెలపడం విశేషం.



డాక్టర్ బాలరాజును విచారిస్తున్న అధికారుల

రోగులకు మెరుగైన సేవలందించాలి

ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), జూలై 30 : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య వైద్యులు, సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు, సిబ్బంది మధ్య నెలకొన్న వివాదాల నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే కొండయ్య వేటపాలెం పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. వ్యక్తిగత కలహాల కారణంగా రోగులకు ఇబ్బందులు కల్పించడం సరికాదన్నారు. మరోసారి వివాదాలకు తావివ్వకుండా నడుచుకోవాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో ఉన్న రోగులతో ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడారు. వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. గడువు తీరిన మందుల విషయం, వైద్యునిపై దాడి ఆరోపణ తదితర అంశాలకు సంబంధించి వివరాలను తెలుసుకున్నారు. అంకిత భావంతో పనిచేయాలని చెప్పారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

సమస్యలపై అంగన్‌వాడీల వినతి

అద్దంకిటౌన్, జూలై 30 : తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ ప్రాధాన కార్యాలయం మంగళగిరిలో మంత్రి కొండా శ్రీనివాస్‌ను, మాజీ ఎంపీ పనబాక లక్ష్మిని, యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు అచంట సునీతను సభ్యులు కలిసి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వాటిని సత్వరమే పరిష్కారించేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ నాయకులు కె.లక్ష్మీనరసమ్మ, జి.అనంతలక్ష్మి, కే.హేమలత, సీహెచ్. సామ్రాజ్యం, బీ నాగజ్యోతి, ఎస్కే మరియాంబి ఉన్నారు.



మొక్కు తీర్చుకుంటున్న గోవాడ టీడీపీ నేతలు

మొక్కు తీర్చుకున్న గోవాడ టీడీపీ నేతలు

అద్దంకి, జూలై 30 : మండలంలోని గోవాడకు చెందిన టీడీపీ నేతలు మంగళవారం పెనుగంచి ప్రోలులో మొక్కు తీర్చుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, గొట్టిపాటి రవికుమార్ మంత్రి పదవి చేపట్టడంతో గోవాడ టీడీపీ నేతలు పెనుగంచి ప్రోలు వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. టీడీపీ నేతలు పుట్టా సాంబయ్య, మాకినేని కొండలు, చెన్నయ్య స్వాములు, రామాంజనేయులు ఉన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

అద్దంకి, జూలై 30 : అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.

ముగిసిన మాన్యం భూముల కౌలు వేలం

గత ఏడాది కంటే పెరిగిన ఆదాయం

చెరుకూరు(పర్చూరు), జూలై 30 : పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ, శ్రీ అగస్తేశ్వర స్వామి వార్ల మాన్యం భూముల కౌలు వేలం పాట ముగిసినట్లు ఆలయ కార్య నిర్వాహక కార్యదర్శి నాగయ్య తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో 284.51 ఎకరాలకు బహిరంగ వేలం నిర్వహించగా, రూ.53 లక్షల ఆదాయం వచ్చింది. గత ఏడాది ఇవే భూములకు నిర్వహించిన కౌలు రూ.49,84,000 రాగా ఈఏడాది అదనంగా రూ.3,16,000లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పశుగణాభివృద్ధికి అందరూ సహకరించాలి



పశు పోషకులకు ఫాడర్ సీడ్‌ను అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, తదితరులు

అద్దంకిటౌన్, జూలై 30 : ఆడ దూడలు పుట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక కార్యక్రమాలను, పథకాలను పశు పోషకులు తెలుసుకొని పశుగణాభివృద్ధికి సహకరించాలని పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్ర ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని యంపరాల గ్రామంలో పశు వైద్య శాఖ అధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం అద్దంకి పశు వైద్య శాల ఏడీ డాక్టర్ ఎం.మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావు మాట్లాడుతూ 90శాతం ఆడదూడలు జననం కోసం ప్రత్యేక సిరమ్‌ను పశువులకు వేస్తారని తెలిపారు. దీని ద్వారా పాడి పశువుల అభివృదితోపాటు పోషకుల ఆర్థిక స్థితి మెరుగవుతుందన్నారు. అనంతరం పశు వైద్య శిబిరంలో గర్భకోశ వ్యాధులు వచ్చిన 70 పశువులకు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్న పశువులను వైద్యులు, 1962 అంబులెన్సు సిబ్బంది, పశు సహాయకులు, గోపాల మిత్రలు తదితరులు చికిత్సను అందించారు. రాజీవ్‌కాలనీలో ఉన్న పశుపోషకుల శిక్షణ కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి పశు పోషకులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, ఒంగోలు పశుగణాభివృద్ధి కార్యనిర్వాహణాధికారి డాక్టర్ బి.రవికుమార్, ఒంగోలు ఏడీ డాక్టర్ ఏ.రమేష్‌బాబు, గ్రామ సర్పంచ్ యడ్లపల్లి వెంకాయమ్మ, బొమ్మనంపాడు, కొరిశపాడు, కోనంకి, మేదరమెట్ల పశువైద్యశాలల వైద్యులు డాక్టర్ ఏలూరి అశోక్, డాక్టర్ బీ వెంకట్రావు, ఏ.క్రాంతికిరణ్, సయ్యద్ చికిత్సను అందించారు. పశు పోషకులకు మినరల్ మిక్సర్ ఫొడర్ సీడ్‌ను అందజేశారు.



ఆలయానికి చేరుకున్న బూదవాడ గ్రామస్థులు

అడి ఉప్పల్ అమ్మవారికి మొక్కులు

పంగులూరు, జూలై 30 : మండలంలోని బూదవాడ టీడీపీ గ్రామ నాయకులు అడిఉప్పల్‌లోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో మంగళవారం తమ మొక్కు తీర్చుకున్నారు. ఎన్నికలలో ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్ విజయం సాధించడంతోపాటు మంత్రి కావాలని గ్రామస్థులు అమ్మవారికి మొక్కుకున్నారు. గొట్టిపాటి గెలవడంతోపాటు మంత్రి కావడంతో అడిఉప్పల్‌లోని శ్రీలక్ష్మీ అమ్మవారికి మొక్కు చెల్లించినట్లు బూదవాడ గ్రామ టీడీపీ నేత కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి మొక్కుకున్నారు. అనుకున్న విధంగా గొట్టిపాటి శాసన సభ్యునిగా ఘన విజయం సాధించి, మంత్రివర్గంలో కొలువుదీరడంతో బూదవాడ గ్రామస్థులు ప్రత్యేక వాహనాలలో అడిఉప్పల్ చేరుకుని మంగళవారం శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కు చెల్లించారు. కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, పిచ్చిరెడ్డి, మురకొండ సుబ్బారావు, గొట్టిపాటి కాజా, నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెకుముకి మాసపత్రికను వినియోగించుకోండి



పత్రికలను అందజేస్తున్న నాయకులు

అద్దంకిటౌన్, జూలై 30 : విద్యార్థులు సైన్స్ విజ్ఞానానికి సంబంధించిన చెకుముకి మాసపత్రికలను సద్వినియోపర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు అన్నారు. మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో స్థానిక కాకానిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చెకుముకి మాసపత్రికలను త్రిమూర్తులు సౌజన్యంతో అందజేశారు. ఇలాంటి పత్రికలను వినియోగించుకొని విద్యార్థులు భవిష్యత్‌లో జరగబోయే అనేక పోటీ పరీక్షలలో విజయం సాధించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తంగా శ్రీనివాసరావు, హెచ్ఎం గురవయ్య, కావూరి రఘుచంద్, సీహెచ్ కృష్ణారెడ్డి, సోము అనూరాధా, సందిరెడ్డి పద్మావతి, ఈశ్వరమ్మ, సురేష్ పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 30 : పర్యావరణ పరిరక్షణలో భాగంగా మంగళవారం మండలంలోని చెరువుకొమ్ముపాలెం గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మలాది శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంక్ ప్రాంతంలో 18 రకాలు పండ్లు, పూల, నీడనిచ్చే మొక్కలు నాటారు. చెట్లు పెంచితేనే మనుగడ ఉంటుందని ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చప్పిడి వీరయ్య, చుండూరి మురళీ సుధాకరరావు, చిన్ని మురళీకృష్ణ, పుట్టరాజు శ్రీరామ చంద్రమూర్తి, హరిప్రసాద్, నాగయ్య, రత్తయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేధింపులపై ఫిర్యాదు

ఇంకొల్లు, జూలై 30 : ఇంకొల్లుకు చెందిన పొనుగుబాటి అశ్విని తనను అత్తింటి వారు కాపురానికి రాకుండా మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అశ్వినికి మండలంలోని పెదనక్కపాలెం గ్రామానికి చెందిన లీలాప్రసాద్‌తో ఏడాది క్రితం వివాహం జరగగా భర్త, అత్త బావ తనను కాపురానికి రానివ్వకుండా మానసికంగా శారీరకంగా వేధిస్తున్నారని ముగ్గురిపై ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ ముస్తఫా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం బాపట్ల ఎస్పీని కలిసి న్యాయం చేయాలని కోరినట్లు అశ్విని తెలిపారు.

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.1.50లక్షల సాయం

పర్చూరు, జూలై 30 : పర్చూరు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని అభివృద్ధి కమిటీ నిర్వాహకులు అన్నారు. శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గుంటా రాజేంద్ర ప్రసాద్ రూ.1.50లక్షల సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కఠారి సురేంద్రబాబు, కోటా హరిప్రసాద్, రంగిశెట్టి ఆంజనేయులు, తులసి శివనాగేశ్వరరావు, కోటేశ్వరరావు, నరసింహం, జీ శ్రీనివాసరావు, క్రిష్ణంశెట్టి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

సీనియర్ సివిల్ న్యాయాధికారి ప్రశాంతి

పర్చూరు, జూలై 30 : బాలికలు అప్రమత్తంగా ఉండాలని, మాయ మాటలు చెప్పేవారిని నమ్మొద్దని సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి అన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా దినం సందర్భంగా మంగళవారం అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రశాంతి మాట్లాడుతూ బాలికల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. విదేశాల్లో ఉద్యోగం ఇస్తామని, మాయమాటలు చెప్పే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థినీ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. విద్యతోనే అభివృద్ధి అన్న విషయం మరవరాదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహాల్దార్ యు.శ్రీనివాసరావు, పర్చూరు బార్ అసోషియేషన్ అధ్యక్షులు సీహెచ్. రమణి, న్యాయవాది ధనలక్ష్మి, ప్రిన్సిపాల్ విశ్వవాణి, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

యువత చైతన్యవంతం కావాలి

అద్దంకి: మానవ అ క్రమ రవాణా నిరోధంపై యువత చైతన్యవంతం కావాలని న్యాయవాది ప్రకాష్ అన్నారు. మానవ అక్రమ రవాణా నిరోధ దినం సందర్భంగా మంగళవారం హర్షిణీ డిగ్రీ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. కార్యక్రమంలో న్యాయవాది మహ్మద్ రఫీ, జ్యోతి రమేష్‌బాబు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి ప్రశాంతి